RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :32 సంచిక : 12 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: బుధవారం 19-08-2026 పేజీలు : 12 వెల: 1-00

## 22న జనసేన ఆత్మీయ సమ్మేళనం

పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా నేతలు



హనుమకొండ, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): జనసేన పార్టీ జిల్లా ముఖ్య నాయకులు గాదె పృథ్వీ, పద్మజాదేవి, గద్దం రాకేష్ మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ నెల 22న హనుమకొండ కేంద్రంగా జరగనున్న ఓరుగల్లు జనసైనికుల ఆత్మీయ సమావేశం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా అన్ని మిగతా 2లో..

## హరీష్ రావు కాదు..అబద్దాల రావు

మరోమారు మంత్రి పొంగులేటి విమర్శలు



హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్దాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని అన్నారు. ఆయన ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వోమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో మాదిరిగా తాము బుకాయించడం లేదని చెప్పారు. కేంద్రం, ఎన్నికల సంఘం, బీఆర్ఎస్ కలిసి ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నాయని.. వారి పప్పులు ఉడకనివ్వబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

## ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం



హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు మిగతా 2లో..

- సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

## ఉరిశిక్షను రద్దు చేయండి

ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి... సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ఆర్ఎన్ఎ): మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై మిగతా 2లో..

## ఎలినినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

తాగునీటికే తొలి ప్రాధాన్యం... పంటలకూ భరోసా కల్పించాలి

అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు

కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు

నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం

సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం

అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ

నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై మిగతా 2లో..

## 29న రైతు పంచాయితీకి సిద్దం అవుతున్న పంజాబ్ రైతులు




న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ఆర్ఎన్ఎ): ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్దు వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం మిగతా 2లో..

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం... 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య

తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి.... పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్



హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు మిగతా 2లో..

## నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్



న్యూఢిల్లీ, ఆగస్ట్ 18 (ఆర్ఎన్ఎ): ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం మిగతా 2లో..

## కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు.... ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం

ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జన్నార్



హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి): హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## ఉరిశిక్షను రద్దు చేయండి

మిక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

## 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

## నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

## 22న జనసేన ఆత్మీయ సమ్మేళనం

పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసైనికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సెగ్మెంట్ల జనసైనికులతో హనుమకొండ కేంద్రంగా ఈనెల 22 శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో వరంగల్ జిల్లా సమస్యలపై జనసేన పోరాటం చేసిందని, రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం చేస్తూ ప్రజాసమస్యలపై మరింత చురుగ్గా పోరాడుతామన్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడం ఖాయం అని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక జనసైనికుడు హాజరై విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నేతలు పలువురు పాల్గొన్నారు.

## కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఎలినినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణెలి నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ÷ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ÷ుగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు. సహజ ప్రవాహాలపై మాత్రమే ఆధారపడే జలాశయాల్లో నీటిని పొదుపుగా వినియోగించడం అవసరమేనని, కానీ నమ్మదగిన ప్రత్యామ్నాయ వనరుల నుంచి తిరిగి నింపుకునే అవకాశం ఉన్న చోట సాగునీటిని అనవసరంగా నిలిపివేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. దేవాదుల, నిజాంసాగర్, స్వర్ణ, సదర్మట్ ఆనకట్ట, రామడుగు, బుగ్గలవాగు, రామపల్లి, పాలెంవాగు, గౌరవవరం, పోచారం, రాజీవ్ సాగర్, నెలవాయి, వట్టివాగు, నల్లవాగు, పాల్వాయి పురుషోత్తంరావు (ఎర్రవాగు), చెల్మెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టుల పరిధిలో అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, సాగునీటి విడుదలకు అవకాశం ఉన్నచోట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ జలాలను కూడా సమర్థంగా వినియోగించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీటి ప్రణాళికలు జలాశయంలోని వాస్తవ నిల్వలు, వస్తున్న ప్రవాహాలకు అనుగుణంగానే ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. నిజాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, సింగూరు సహా గోదావరి బేసిన్‌లోని ఇతర ప్రధాన జలాశయాల పరిస్థితిని కూడా సమగ్రంగా సమీక్షించారు. సింగూరు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డ్యామ్‌కు అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులను వేగవంతం చేయాలని, తాజా నీటి నిల్వలను మరోసారి ధ్రువీకరించి సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇంజినీర్లకు సూచించారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. ఇన్‌లెట్, అవుట్‌లెట్ రెండు వైపుల నుంచి తవ్వకం కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు. భౌగోళికంగా అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో ఇంజినీర్లు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనుల వేగాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. జలవనరులకు సంబంధించిన అన్ని సాంకేతిక అధ్యయనాల్లో కేంద్ర జల సంఘం, భారత వాతావరణ శాఖ (ఎఓఅ) తాజా సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాలం చెల్లిన సమాచారంపై ఆధారపడకుండా నదుల క్రాస్ సెక్షన్లను తాజా పరిస్థితులకు అనుగుణంగా నవీకరించాలని సూచించారు. ÷రిళిలవరం ప్రాజెక్టు వల్ల

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

**సామాన్యుడిగా వచ్చి..అసామాన్యుడిగా ఎదిగారు.... కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి**

**విశాఖపట్నం, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు.



ఆంధ్రప్రదేశ్‌పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్‌కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చేయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

# నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

**ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం**

**24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి**

**తప్పును సరిదిద్దుకుంటున్నాం**

**మీడియాతో మంత్రి పొంగులేని వివరణ**

**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే ప్రక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

- ■త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు
- ■చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యులభేటీ..
- ■ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష

**హైదరాబాద్, ఆగస్ట్ 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారి నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ఒక ముసాయిదా నోట్' పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు.సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు): ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం.రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు.మూడవ కేటగిరీ (జైలు జీవితం గడిపిన వారు): తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు. నాల్గవ కేటగిరీ (కేసులు నమోదైన వారు): నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు. ప్రత్యేక కేటగిరీలు (సంస్థాగత / క్రియాశీలక శ్రేణులు): కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు మరియు వివిధ సంస్థల సభ్యులు. ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యోగులు మరియు వసతి కలిగిన వారు కేవలం 'గుర్తింపు కార్డు / ప్రశంసా పత్రం' ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే, కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు. ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ / పోర్టల్ ద్వారా అవకాశం కల్పిస్తారు. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం జరుగుతంది. శాసనసభ్యులు , శాసనమండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సమర్పించాలని నిర్ణయించారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక లష్కైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷-రోత్సహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్దతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్నాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

### ప్రధాని నోట మాటరావడం ఆలస్యం.. సోషల్ మీడియాలో ఉత్పన్నం

**న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కారాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి నిర్మూలన,



నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

### నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి... సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు

### బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది... బిఆర్ఎస్ నేత హరీస్ రావు డిమాండ్




**హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసీపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక్ నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా? ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్ట్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమిషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

# పెన్షన్ కోసం వయోవృద్ధుల ఎదురుచూపు

### కొత్త ప్రకటనలో అవకాశం లేకపోవడంపై ఆందోళన

**హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నూతన చేయూత పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించి, అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ నిర్ణయం ఏళ్ల తరబడి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వేలాదిమంది వయోవృద్ధులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఏడు రకాల పింఛన్లకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వృద్ధాప్య పింఛన్లను ఈ జాబితాలో చేర్చకపోవడం తో వృద్ధుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వృద్ధాప్య పింఛను వయోపరిమితిని తగ్గించినప్పటికీ అనేక మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ఆన్‌లైన ఐడీలు ఓపెన్ కాకపోవడంతో వేలాది మంది అర్హులైన వృద్ధులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా తమకు అవకాశం వస్తుందని భావించిన వయోవృద్ధులకు ప్రస్తుతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడతగా ఏడు కేటగిరీల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, పైలేరియా, తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించారు.

కొత్త పింఛన్ల దరఖాస్తుకు రకరకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో జిల్లాల్లోని తహసీల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛను రూ.4016, వితంతు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ.2016 ప్రతినెలా అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఆ దరఖాస్తుదారులకు నేరుగా పింఛన్ ఇస్తారా లేక మళ్లీ కొత్తగా అప్లై చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అర్హులైన వారు ఈనెల 31లోపు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా వార్డు ఆఫీసర్లకు తమ దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

# రోడ్డు పనుల్లో తవ్వుతుండగా రెండు శవాలు లభ్యం

**విశాఖపట్నం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** నగరంలోని షీలా నగర్‌లో రెండు మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. షీలానగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న షీలానగర్-సబ్బవరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనుల్లో భాగంగా రెండు గుర్తుతెలియని శవాలు లభించాయి. మంగళవారం డంపర్ లారీలు మట్టి వేస్తుండగా కుప్పలో 2 శవాలు కనిపించాయి. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడకు చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. ఒకటి మహిళ మృతదేహం కాగా మరొకటి పురుషుడి మృతదేహంగా గుర్తించారు. రెండు మృతదేహాలూ పూర్తిగా డికంపోజ్ అయినట్లు తెలిపారు. అంతేకాకుండా.. మట్టిలో పాత తలగడలు, బొంతలు, పూలమాలలు, చెక్కలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు పనుల్లో భాగంగా ఉపయోగించిన మట్టి.. శ్మశానం నుంచి తీసుకొచ్చినట్లుగా అనుమానిస్తున్నామని ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు.

# పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

### టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే భూలక్ష్మి కింద ఎకరం పంపిణీ... పేదల భూములను లాక్కుంటూ పోతే చూస్తూ ఊరుకోం

### టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరిక

**హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు.



వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు. విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిందని.. ఆ తర్వాత ఆపేసిందని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి - పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత పేర్కొన్నారు.

# వినాయకుని జన్మస్థలం... సందర్శించిన సంతానభాగ్యం




సొంతం భారత పురాణా, ఇతిహా సాల్లో ఆది దేవుడిగా పూజలందుకునే వినాయకుడి ప్రస్తావన లేకుండా ఏ ఘట్టం కూడా మొదలు కాదంటే అతిశయోక్తి కాదేమో. అయితే ఆది దంపతుల పుత్రుడైన ఆ పార్వతి తనయుడైన వినాయకుడి జన్మ వత్తాంతం గురించి చాలా మందికి తెలుసు. అయితే ఘటం జరిగిన ప్రాంతం మన దేశంలోని హిమాలయాల పర్వత ప్రాంతాల్లోనే ఉందనేది చాలా మందికి తెలియని విషయం. వినాయకుడు మొట్టికాయలు తిన్నది ఇక్కడే... ఇప్పుడిప్పుడే వినాయకుడు పుట్టిన ప్రాంతం పర్యాటక కేంద్రంగా, ప్రముఖ ట్రెక్కింగ్ స్పాట్ గా గుర్తింపు పొందుతున్న ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే కొంత దూరం నడక తప్పదు. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం అటు పుణ్యక్షేత్రంగానే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణానికి నిలయంగా ఉంది. ఇక వినాయకుడు పుట్టిన ప్రదేశం చుట్టూ అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈ కథనంలో సదరు దేవాలయాల విశేషాలతో పాటు చుట్టు పక్కల ఉన్న ట్రెక్కింగ్ ప్రాంతాల గురించి తెలుసుకుందాం.

1. ఉత్తర కాశిలో... వినయకుడు పుట్టిన ప్రదేశం ఉత్తరకాశిలో ఉంది. ఉత్తరకాశి సముద్ర మట్టానికి 1158 మీటర్ల ఎత్తులోఉన్న ఒక అందమైన జిల్లా. తూర్పున చమోలి జిల్లా, ఉత్తరన హిమాచల్ ప్రదేశ్ మరియు టిబెట్ ఉంటాయి. ఈ ప్రదేశం హిందువులకు ఎంతో మతసంబంధ ప్రాముఖ్యత కలిగి ఉంది, మరియు 'నార్త్ కాశీ' అదే విధంగా 'టెంపుల్స్ టౌన్' అని పిలువబడుతుంది. అందుకే ఇక్కడకు శివభక్తులతో పాటు అఘోరాలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ఇక ఉత్తర కాశిలో ఆ దేవుడు జన్మించిన స్థలం గురించి తెలుసుకునే ముందు చుట్టు పక్కల ఉన్న ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను గురించి తెలుసుకుందా.

2. గంగానది ఒడ్డున ఈ పరమ పవిత్ర నగర గంగానది ఒడ్డున ఉంటుంది. ఋషికేష్‌కు 172 కి.మీ. దూరంలో ఉంది. ఈ ప్రదేశం ప్రసిద్ధి మత సంబంధమైన ప్రాంతాలకు, గంగోత్రి మరియు యమునోత్రికి చేరువలో ఉంది. ఈ ప్రాంతంలో ప్రధానంగా ఉత్తర కురుస్, ఖసస్, కిరతాస్, కునిన్డాస్, తంగనస్ మరియు ప్రతంగనస్ వంటి తెగలకు చెందినవారు నివశిస్తుంటారు. దీంతో ఇక్కడ గిరిజన సంప్రదాయాలను మనం చూడవచ్చు.

3. విశ్వనాథ ఆలయం విశ్వనాథ ఆలయం, ఉత్తరకాశి ఉత్తరకాశిలో ఉన్న ఆలయాల్లో ప్రముఖ ఆల యం విశ్వనాథ ఆలయం. ఈ ఆలయం శివునికి అంకిత మివ్వబడింది. ఈ సన్నిధిలో భక్తులు నిత్యం మంత్రాలు పఠిస్తుంటారు. ఇక్కడ ప్రధాన ఆకర్షణ శివుని ఆయుధం త్రిశూలం. ఇది 26 అడుగుల ఎత్తు కలిగి ఉం టుంది. ఈ ఆలయం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత తాండవిస్తుం టుంది. ఈ ప్రసిద్ధ ఆలయం ఉత్తరకాశికి 300మీ. దూరంలో స్థానికబస్సు స్టాండ్ సమీపంలో ఉంది.

4. రెండు ఘాట్ లు... మణికర్ణిక ఘాట్, ఉత్తరకాశి మణికర్ణిక ఘాట్ , ఉత్తర కాశి లో ముఖ్యమైన మత సంబంధ కేంద్రం. పురాణం ప్రకారం, ఉత్తర కాశి పట్టణం గొప్ప ఋషి జడా భారత మాత పశ్చా త్తపుడు అయిన ప్రదేశం. ఈ ప్రదేశం గురించి హిందూ మత పుస్తకం స్కంధ పురా ణంలో కేదార్ ఖండ్ లో వివరిం చబడింది. అందు వల్లే ఈ చోటును పరమ పవి త్రమైన స్థలంగా హిందు వులు భావించి ఎక్కువ సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు.

5. గంగోత్రి ఇక్కడే గంగోత్రి త్తరకాశి లో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రం. ఇది సముద్ర మట్టానికి 3750 మీటర్ల ఎత్తున హిమాలయ పర్వత శ్రేణుల్లో ఉన్నది. ఈ ప్రాంతం మంచు పర్వతాలు, హిమా నీనదాలు, పొడవైన గట్లు, లోతైన సన్నని త్రోవలు, ఊర్ధ్వ శిఖరాలు మరియు సన్నని లోయలు కలిగి ఉంది. అదే విధంగా ఇక్కడ భగీరథి శిల, గంగోత్రి, ఉత్తరకాశి భగీరథి శిల అనేది గంగోత్రి యొక్క ప్రముఖ పర్యాటక ఆకర్షణ. ఈ రాతిశిల మీదే భగీరథ మహారాజు గంగా మాత గురించి తపస్సు చేశాడని పురాణాలు చెపుతున్నాయి.

6. సముద్ర మట్టానికి 3048 మీటర్ల ఎత్తులో... ఉత్తరకాశి దయార బుగ్యల్ అనే ప్రదేశం ఉత్తరకాశి లో సముద్రమట్టానికి 3048 మీటర్ల ఎత్తున ఉన్నది. భట్వారీ గా పిలువబడే ఈ ప్రాంతం ఉత్తరకాశి – గంగోత్రి రోడ్డు మీద ఉన్నది. ఇది ఒక గడ్డి మైదానం. ఇక్కడికి వాహనాల్లో చేరుకోవచ్చు లేకుంటే బసరు గ్రామం నుండి 8 కి. మీ. ట్రెక్కింగ్ చేసుకుంటూ కూడా చేరుకోవచ్చు. ట్రెక్కింగ్ చేసుకుంటూ వచ్చే యాత్రికులు మార్గ మధ్యలో శేషనాగ్ ఆలయాన్ని చూడవచ్చు.

7. రుద్రాభిషేకం... ఏకాదశ రుద్ర ఆలయం, గంగోత్రి, ఉత్తర కాశి ఏకాదశ రుద్ర ఆలయం గంగోత్రి లోని భగీరథి నది ఒడ్డున ఉన్నది. ఇక్కడ జరిగే పూజ ఎంతో ప్రశస్తిగాంచినది. శివుని 11 రుద్రాలకు జరిగే పూజ ఏకాదశ రుద్రాభిషేకం పూజ గా ఖ్యాతికెక్కింది. ఈ సమయంలో ఆ ప్రాంతం మొత్తం శివ శివ శంకర, భం..భం భోళేనాథ్ నాథ్, హరహర మహాదేవ నామ స్మరణలతో మర్మోగుతంది. అఘోరాలు ఈ రుద్రాభిషేకం జరపడానికే సుదూర ప్రాంతాలనుంచి ఇక్కడికి వస్తారు.



8. గంగోత్రి ఆలయం గంగోత్రి, ఉత్తరకాశి గంగోత్రి టెంపుల్ భగీరథి నది ఒడ్డున ఉన్నది. ఈ ఆలయం సముద్ర మట్టానికి 3200 మీ. ల ఎత్తున కలదు. ఈ టెంపుల్‌లో గంగా మాత విగ్రహం వుంటుంది. చలికాలంలో ఈ టెంపుల్ అధిక మంచు కారణంగా మూసివేస్తారు. ఆలయానికి సమీపం లో అనేక ఆశ్రమాలు కలవు. వీటిలో యాత్రికులు బస చేయవచ్చు. ఇక్కడికి దగ్గర్లోనే గ్యానేశ్వర దేవాలయం కూడా భగీరథి నది ఒడ్డున ఉన్నది. ఈ దేవాలయం లో చాలా మంది భక్తులు తమ వారి క్షేమం కోసం వచ్చి పూజలు, యగ్నాలు, వ్రతాలు చేస్తుంటారు.

9. నీటిలో మునిగి ఉన్న శివలింగం, గంగోత్రి, ఉత్తర కాశి నీటిలో మునిగి ఉన్న శివ లింగం, గంగోత్రి యొక్క పవిత్ర పర్యాటక ఆకర్షణ. ఈ సహజ శివలిం గాన్ని, శీతాకాలంలో నీటి మట్టం తగ్గటం వలన, ఆ కాలంలో మాత్రమే చూడగలం. దీనిని జలమగ్న శివలింగం అని కూడా పిలుస్తారు.పురాణాలప్రకారం, శివుడు ఈప్రదేశంలోనేగంగను తన శిఖలో బంధిం చాడని చెపుతారు. అందువల్ల ఇక్కడ ఆపరమశివుడినిభక్తి శ్రద్ధలతో కొలిస్తే వ్యవ సాయరంగంలోని వారికిమేలుజరుగు తుందని చెబుతారు.

10. పాండవ గుఫా,గంగోత్రి,ఉత్తరకాశిపాండవగుఫా మహాభారత కాలం నాటిది.గొప్ప శివ భక్తులైన పాండవులు ఈ గుహలోనే ధ్యానం చేసేవారని పురాణాలలో పేర్కొన్నారు. గంగోత్రి నుండి యాత్రికులు ఇక్కడికి ట్రెక్కింగ్ ద్వారా మాత్రమే చేరుకుంటారు. ట్రెక్కింగ్ మార్గం ఒకటిన్నారాకిలోమీటరుఉంటుంది. చుట్టూ ఉన్న తెల్లని మంచుకొండలను చూస్తూ అలానడుచుకుంటూ వెళ్లడం మరిచిపోలేని అనుభూతిని ఇస్తుంది.

11. సూర్య కుండ్ మరియు గౌరీ కుండ్ గంగోత్రి, ఉత్తరకాశి సూర్య కుండ్ మరియు గౌరీ కుండ్ అనేవి గంగోత్రి లో ఉన్న రెండు చెరువుల పేర్లు. ఇవి ప్రధాన గంగోత్రి ఆలయానికి చేరువలో ఉన్నాయి. యాత్రికులు ఈచెరువుల్లో ప్రవహిస్తున్న నీటి సవ్వడుల నువింటూ ఆనందాన్ని ఆస్వాదిం చవచ్చు.ఇక్కడి జలాన్నితల పైవేసు కుంటే సర్వ పాపాలు పోతాయని చెబుతారు. ఇక్కడకు కూడా ట్రెక్కింగ్‌ద్వారాచేరుకోవలసి ఉంటుంది.

12. గంజ్ఞాని గంజ్ఞాని, గంగోత్రి లో ధ్యానం కు అనువైన ఆధ్యాత్మిక స్థలం. అందమైన పర్వతాలు, ఆహ్లాదకర వాతావరణం ఇక్కడి ప్రదేశ అందాల్ని మరింతగా పెంచాయి. సాధారణంగా ఇక్కడి రిషికుండ్ అనే నీటి కొలనులో స్నానాలు చేసిన తర్వాత గంగోత్రి ఆలయాన్ని సందర్శిస్తుంటారు భక్తులు. ఇక ఈ ఆధ్యాత్మిక స్థలంలో అఘోరాలు కొన్ని రోజుల పాటు ధ్యానంలో మునిగిపోతారు. కేవలం అఘోరాలే కాకుండా సాధారణ భక్తులు కూడా ఇక్కడ ధ్యానం చేస్తుంటారు.

13. యమునోత్రి... గంగోత్రి ఇవి రెండూ కూడా ఒకదానికొకటి 50 కి. మీ. దూరంలో ఉంటాయి. ఈ ప్రదేశంలోనే పవిత్ర యమునా నది పుట్టింది. సముద్రమట్టానికి 3293 మీటర్ల ఎత్తులో ఈ ప్రదేశం ఉన్నది. సాదారణంగా యమునోత్రి చేరుకోవాలంటే భక్తులు కాస్త అవస్థలు పడక తప్పదు. మార్గం అంతా కూడా అడవులతో నిండి ఉండి, ఎత్తుపల్లాలుగా ఉంటుంది. ట్రెక్కింగ్ చేయాలంటే ఒకరోజు పడుతుంది. గాడిదలు, గుర్రాలువంటి వాటిమీదప్రయాణించి భక్తులుయమునోత్రిని సందర్శిస్తుంటారు.

14. యమునోత్రి ఆలయం యమునోత్రి, ఉత్తరకాశి యమునోత్రి టెంపుల్ సముద్రమట్టానికి 3235 మీ.ల ఎత్తున కలదు. ఇక్కడ యమునా దేవి విగ్రహం వుంటుంది. దీనితో పాటు హిందూ దేముడు యమ ధర్మరాజు విగ్రహం కూడా వుంటుంది. ఇది చార్ ధామ్ గా చెప్పబడే నాలుగు టెంపుల్స్ లో ఒకటి. ఈ టెంపుల్ ద్వారాలు 'అక్షయ త ృతీయ' నాడు మాత్రమే తెరుస్తారు. దీంతో అక్షయ త ృతీయ నాటికి యాత్రికులు ఇక్కడకు వచ్చేలా తమ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు.

15. సూర్యకుండ్ యము నోత్రి సమీపంలోని ఒక వేడి నీటి బుగ్గ. ఈ స్ప్రింగ్ యొక్క వేడి నీరు ఆలయ ప్రసాదం తయారు చేసేందుకు అవసరమైన రైస్ మరియు ఆలు(ఉర్లగడ్డ)లు ఉడికిం చేందుకు ఉపయో గిస్తారు. మాత యము నోత్రి కి ప్రసాదం నైవేద్యం పెట్టిన తర్వాత దానిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేస్తారు. చుట్టూ మంచు పర్వతాల నడుమ వేడి నీటి బుగ్గ ఉండటం ఆ దేవి కటాక్షంవల్లే సాధ్యమయ్యిందని భక్తులు విశ్వసిస్తుంటారు.

16. బర్కోట్ సముద్రమట్టానికి సుమారు 1220 మీ.ల ఎత్తులో, యమునోత్రి కి 4 కి.మీ.ల దూరంలో కలదు. పర్యాటకులు ఇక్కడ నుండి బందర్ పూంచ్ పర్వత శిఖరాలతో పాటు యమునా నది, పచ్చటి ప్రదేశాలు, ఆపిల్ తోటలు చూడవచ్చు. యమునోత్రి వెళ్ళే వారికి ఇది ఒక పర్యాటక మజిలీగా వుంటుంది. ఇక యమునోత్రి ఆలయానికి సమీపంలో ఉన్న దివ్యశిల అనేది ఒక రాతి స్తంభం. ఈ దివ్య శిల ను భగవంతుని వెలుగు గా చెబు తారు. యమునోత్రి ఆలయానికి వెళ్ళేవారు ముందుగా ఈ దివ్య శిల ను పూజించి



# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి... విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది**

**ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం... గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు**

**వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం... కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ... సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని



ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి. 2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి.. నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సవరణ బిల్లుతో పురపాలక వ్యవస్థలో పారదర్శకత... : ఎమ్మెల్యే బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం, ఆగస్టు 18 (ఆర్ఎన్ఏ):** పురపాలక సంఘాల్లో ఆస్తుల బదలాయింపు, పన్నుల విధానంలో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లును తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సోమవారం పురపాలక సవరణ బిల్లుపై చర్చలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఈ బిల్లు ద్వారా ప్రజలకు మరింత సులభతరమైన, పారదర్శకమైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.ఆస్తి కొనుగోలు చేసిన వ్యక్తి ఆస్తి మార్పు కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, రిజిస్ట్రేషన్ కు సంబంధిత ఫీజు చెల్లించిన వెంటనే ఆస్తి బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కల్పించడం ప్రభుత్వానికి ఘనతగా ఆయన అభివర్ణించారు.ఇప్పటివరకు వివిధ పురపాలక సంఘాల్లో వేర్వేరు మ్యూటేషన్ ఛార్జీలు ఉండేవని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన ఫీజులు అమలు చేయడం మంచి నిర్ణయమని శ్రీనివాస్ అన్నారు. దీనివల్ల ప్రజలపై అనవసరమైన భారాలు తగ్గడంతో పాటు, విధానంలో ఏకరూపత ఏర్పడుతుందని తెలిపారు.అలాగే గతంలో పన్నుల విధింపులో అధికారుల విచక్షణకు అవకాశం ఉండేదని, దీనివల్ల కొన్ని సందర్భాల్లో అవకతవకలకు ఆస్కారం ఏర్పడే పరిస్థితి ఉండేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పన్నులు విధించే విధానం తీసుకురావడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని

## యనమదురు డ్రైయిన్ సామర్థ్యం పెంపు

**శాసనభలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

**అమరావతి, ఆగస్టు 18 (ఆర్ఎన్ఎ):** ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలతో సభ సోమవారం ప్రారంభం అయ్యింది. యనమదురు డ్రెయిన్ ఆధునీకరణ, కేశనపల్లి కెనాల్ ప్రాజెక్టు స్థితిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. గోదావరి పశ్చిమ డెల్టాలో యనమదురు డ్రెయిన్ ముఖ్యమైనదన్నారు. 23వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న యనమదురు డ్రెయిన్‌కు, సామర్థ్యానికి మించి వరద వస్తోందని తెలిపారు. యనమదురు డ్రెయిన్ సామర్థ్యాన్ని 30వేల క్యూసెక్కులకు పెంచడం, శిథిలావస్థకు చేరిన ఇన్‌లెట్లను పునర్నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. యనమదురు డ్రెయిన్‌లో 86 ఇన్‌లెట్లకు గానూ 70 ఇన్‌లెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు విడతల్లో రూ.3.2 కోట్లు కేటాయించి,10 ఇన్‌లెట్లను పునర్నిర్మిస్తున్నామన్నారు. యనమదురు డ్రెయిన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తున్నందున, ఉప్పుటేరును కూడా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గోదావరి డెల్టాలోని కాలువలు, డ్రెయిన్‌ల ఆధునీకరణ కోసం రూ.14 కోట్లు కేటాయించి లైడార్ సర్వే పూర్తి చేసి, డీపీఆర్ తయారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్య ప్రాజెక్టులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరిగేషన్ క్యాలెండర్‌ను విడుదల చేశారన్నారు. 6 ప్రాధాన్య ప్రాజెక్టులలో గోదావరి డెల్టా ఆధునికీకరణను కూడా చేర్చినట్లు నిమ్మల తెలిపారు. 2029 లోపు గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2019–24 పాలనలో ఓఅండ్ఎంకు నిధులు కేటాయించకపోవడంతో పాటు.. డీసిల్టింగ్, లాకులు, షట్టర్లు, రోప్స్ రిపేర్ల వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్లలోనే రూ.1100 కోట్లకు పైగా నిధులు కేటాయించి ఓఅండ్ఎం పనులను చేపట్టామన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో 2686 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కేసనపల్లి కెనాల్ ప్రాజెక్ట్‌కు అంచనాలు తయారు చేస్తున్నామన్నారు. కొబ్బరి పంట ఆధారిత గ్రామాల్లోకి సముద్రపునీరు చొచ్చుకు వస్తోందని, ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో రూ.50 కోట్లతో కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టును ప్రతిపాదించామని అన్నారు. 2017–18 గత టీడీపీ పాలనలో జరిగిన డ్రెడ్జింగ్ పనులు మినహా, గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి పని కూడా జరుగలేదని తెలిపారు. డ్రైన్ ద్వారా సముద్రపు నీరు రావడంతో వేలాది ఎకరాల్లో రైతులు కొబ్బరి పంట నష్టపోయారని మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, శంఖరగుప్తం డ్రైన్ సమస్యను రైతులు, నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఇరిగేషన్ నిపుణులతో ప్రత్యక్షంగా పరిశీలించి, మరో రెండు సార్లు సమీక్షలు జరిపి రూ.21 కోట్ల నిధులను విడుదల చేశామని చెప్పారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషితో ఆర్థిక శాఖ నుంచి నిధులు సాధించి, పనులు చేపట్టామన్నారు. శంఖరగుప్తం డ్రెయిన్ పనులు 25 శాతం పూర్తవ్వగా, మే–2027 నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## మున్సిపల్ చట్టసవరణకు ఎపి అసెంబ్లీ ఆమోదం

**స్వల్ప చర్చ అనంతరం ఆమోదించిన సభ**

**అమరావతి,ఆగస్టు18(ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల మూడో సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మంత్రి నారాయణ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా.. స్వల్ప చర్చ అనంతరం సభ ఆమోదించింది. ఆస్తుల రిజిస్ట్రేషన్ పక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు, మున్సిపల్ రికార్డుల్లో యజమాని పేరు మార్పు పక్రియను వేగవంతం చేసేలా ప్రభుత్వం ఈ సవరణలు చేసింది. ప్రస్తుతం ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మున్సిపాలిటీల్లో యజమాని పేరు నమోదు కోసం విడిగా మ్యుటేషన్ పక్రియ చేపట్టాల్సి వస్తోంది. ఇకపై రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే మున్సిపల్ రికార్డుల్లోనూ యజమాని పేరు ఆటోమేటిక్‌గా మారేలా వ్యవస్థను అనుసంధానం చేయనున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ ఫీజు చెల్లించేలా చట్టంలో మార్పులు చేశారు. అలాగే కార్పొరేషన్లు, గ్రేడ్‌ల వారీగా ఉన్న మున్సిపాలిటీల్లో మ్యుటేషన్‌కు ఏకీకృత ఫీజులు అమలు చేసేలా సవరణలు తీసుకొచ్చారు. దీంతో ఆస్తుల బదలాయింపు పక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

## మత్స్యకారుల బోటు కోసం ఆరా

**13న రావాల్సి ఉండగా ఆచూకీ దక్కని వైనం**

**కోనసీమ,ఆగస్టు18(ఆర్ఎన్ఎ):** చేపల వేటకు వెళ్లి తిరిగి రాని మత్స్యకారుల బోటు కోసం కోనసీమ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటు ఈ నెల 3న చేపల వేటకు వెళ్లినట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. అయితే ఈ నెల 13న తిరిగి ఓడలరేవుకు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు బోటు తిరిగి రాలేదని వెల్లడించారు. బోటులో మొత్తం 8 మంది మత్స్యకారులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, 1,000 లీటర్ల డీజిల్ ఉన్నట్లు ప్రాథమిక సమాచారం మేరకు తెలుస్తోంది. బోటు విశాఖపట్నం, పారాదీప్ తీర ప్రాంతాల వైపు వెళ్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మత్స్యకారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే ఈ విషయాన్ని ఇండియన్ కోస్ట్‌గార్డ్ దృష్టికి తీసుకెళ్లి, గాలింపు, రక్షణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో సమన్వయం చేసుకుని మత్స్యకారుల ఆచూకీ కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# నెల రోజుల్లో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి..**
**లేకుంటే సెక్రటేరియట్ ముట్టడి**
**టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్**



**మేడ్చల్ మల్కాజిగిరి, (శామీర్ పేట ),ఆగష్టు18 (నేటి మనదేశమ్):** జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల రోజుల్లోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే జర్నలిస్టులను సమీకరించి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.మంగళవారం మేడ్చల్ జిల్లా ప్రెస్‌క్లబ్‌కు మారుతి సాగర్ మర్యాదపూర్వకంగా హాజరై జిల్లా మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యపరమైన భద్రత కల్పించేందుకు హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.250 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఆ నిధికి చిల్లిగవ్వ కూడా కేటాయించలేదని మారుతి సాగర్ విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు.జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్‌లు ఎంతో అవసరమని, సమావేశాలు, సమాచార మార్పిడి, వృత్తిపరమైన కార్యక్రమాల నిర్వహణకు అనువైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రెస్‌క్లబ్‌ల సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించి, అవసరమైన సహకారం అందించాలని కోరారు.జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నెల రోజుల్లోగా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మారుతి సాగర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చి సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం అవసరమైతే దశలవారీగా మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.అంతకుముందు మేడ్చల్ జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యవర్గం మారుతి సాగర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, జిల్లా మీడియా అక్రెడిటేషన్ సభ్యుడు రామారావు, జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, మీడియా అక్రెడిటేషన్ సభ్యుడు కె. రవిచంద్ర, జిల్లా ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రవీందర్, కార్యవర్గ సభ్యులు కృష్ణ, రవికిరణ్, బాల్‌రెడ్డి, భూపాల్, ప్రసాద్‌తో పాటు వివిధ పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

**వేడుకలు..పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి జిలా ఆగష్టు18 (నేటి మనదేశమ్):** రాజపేట మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య , మాజీ ఎంపీ శ్రీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బీర్ల అయిలయ్య, బూర నర్సయ్య గౌడ్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని, ఆయన ధైర్యసాహసాలను, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.విగ్రహావిష్కరణ అనంతరం రాజపేట మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు, యువత, గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు పాపన్న జీవిత చరిత్ర, ఆయన సామాజిక పోరాటం, సమాజంలో సమానత్వం కోసం చేసిన కృషిని వివరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక గొప్ప వీరుడు, ప్రజా నాయకుడు అని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీర్ల అయిలయ్య అన్నారు. బహుజనులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.సర్దార్ సర్వాయి పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సమానత్వ భావనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యమా..? ఇక కఠిన చర్యలు తప్పవు!

**పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే జీఎంఆర్ ఫైర్.... ...**
**రూ.75 కోట్ల పనులపై సమీక్ష.. బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని ఆదేశం**
**సెప్టెంబర్‌లో పోచారం, లకడారం సబ్‌స్టేషన్ల ప్రారంభం**
**మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం, వీధిదీపాలకు అత్యధిక ప్రాధాన్యత**





**పటాన్‌చేరు ఆగష్టు18 (నేటి మనదేశమ్):** ప్రజల కోసం మంజూరైన అభివృద్ధి నిధులను సకాలంలో వినియోగించకుండా పనుల్లో జాప్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేదని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. అధికారులు, కాంట్రాక్టర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించి పనుల వేగాన్ని పెంచి ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, విద్యుత్, విద్య, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ తదితర శాఖల అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు ఎదురవుతున్న మౌలిక వసతుల సమస్యలు, భవిష్యత్ అవసరాలపై అధికారులతో చర్చించారు.

**రూ.75 కోట్ల పనులపై సమగ్ర సమీక్ష** ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీల పరిధిలో సుమారు రూ.75 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, జాప్యం జరుగుతున్న అంశాలపై అధికారుల నుంచి వివరాలు కోరారు.ప్రతి అభివృద్ధి పనికి స్పష్టమైన గడువు నిర్దేశించి, ఆ గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎటువంటి రాజీకి తావు ఇవ్వవద్దని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు వేగంగా పూర్తయ్యేలా శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

**కాంట్రాక్టర్లపై కఠిన వైఖరి.. బ్లాక్‌లిస్ట్‌కు ఆదేశం** టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల కోసం మంజూరైన నిధులు కార్యాలయ ఫైళ్లలో నిలిచిపోవడానికి కాదని, అవి అభివృద్ధి పనులుగా మారాలని స్పష్టం చేశారు.పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి, ప్రత్యామ్నాయ కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులు తక్షణమే ప్రారంభించాలని సూచించారు."ప్రజల కోసం మంజూరైన నిధులు నిలిచిపోవడానికి వీల్లేదు. పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తే ఎటువంటి ఉపేక్ష ఉండదు" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాల అమలుపై దృష్టి** చేయూత పింఛన్లపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.సంక్షేమ పథకాల అమలులో అర్హులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చొరవ చూపాలని అన్నారు.

**మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యత** ప్రజలకు అత్యవసరమైన విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ తక్షణ పరిష్కారం అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం, అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం, మౌలిక వసతులను మెరుగుపరచడం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం లేదా జాప్యం సహించబడదని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం కృషి చేయాలి

**జగిత్యాల కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు**
**- నివాళులర్పించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యేల, ఆగస్టు 18(నేటి మన దేశమ్ ప్రతినిధి):** సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న గౌడ్ తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు.పాపన్న గౌడ్‌ను కేవలం యుద్ధ వీరుడిగా, కోటలను జయించిన సైనిక నాయకుడిగా మాత్రమే చూడకూడదని కలెక్టర్ అన్నారు. వివిధ సామాజిక వర్గాల ప్రజలను ఏకం చేసి, అప్పటి ఆధిపత్య వ్యవస్థలను సవాలు చేసిన ప్రజా నాయకుడిగా ఆయనకు చరిత్రలో విశిష్ట స్థానం ఉందన్నారు. గోల్కొండను పాలించిన బహుజన చక్రవర్తిగా పాపన్న గౌడ్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.ఆయన జీవిత గాథలో ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా భాగస్వామ్యం, అధికారంలో సమాన భాగస్వామ్యం వంటి విలువలు అంతర్లీనంగా ఉన్నాయని తెలిపారు. 17వ శతాబ్దంలోనే సామాజికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల ప్రజలను ఏకం చేసి తన పోరాటానికి పునాది వేసిన పాపన్న గౌడ్.. అధికారం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కావాల్సిన అవసరం లేదని తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పారని అన్నారు.సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని కలెక్టర్ పేర్కొన్నారు. పాపన్న గౌడ్ పోరాట పటిమ, ధైర్యం, ఆత్మగౌరవ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, డీఆర్వో ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

**బహుజన రాజ్య స్థాపనకు పాపన్న పునాది.. యువత ఆయన ఆశయాలను కొనసాగించాలి**



**మేడ్చల్--మల్కాజిగిరి, ఆగష్టు18 (నేటి మనదేశమ్):** సామాజిక అసమానతలను ఎదిరించి బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని శామీర్‌పేట గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం శామీర్‌పేట కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అణగారిన, బహుజన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహా వీరుడని కొనియాడారు. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో ఆధిపత్య శక్తులను ఎదురించి సామాన్య ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి తన పోరాట పటిమను చాటుకున్నారని గుర్తుచేశారు.మొగల్ పాలనను ధిక్కరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసి బహుజన రాజ్య స్థాపనకు బాటలు వేసిన సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పాపన్న గౌడ్ జీవిత చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరం యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సూచించారు.సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేవలం ఉత్సవాలకే పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యాస్కి సత్యనారాయణ గౌడ్ (మాజీ ఉపసర్పంచ్), శామీర్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, శామీర్‌పేట మండల సీపీఐ పార్టీ కార్యదర్శి డీజీ నరేంద్ర ప్రసాద్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు బండి శ్రీరాములు గౌడ్, యాస్కి యాదగిరి గౌడ్, బత్తిని సత్యనారాయణ గౌడ్, యాస్కి సాయిబాబా గౌడ్, యాస్కి శోభన్ గౌడ్, బండి శేఖర్ గౌడ్, దూడల వెంకటేష్ గౌడ్, దూసరి శంకర్ గౌడ్, సత్య స్వామి గౌడ్, యాస్కి శ్రీకాంత్ గౌడ్‌తో పాటు గౌడ సంఘం నాయకులు, మహిళలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూకపల్లి అర్బన్ కాలనీకి మౌలిక వసతులు..

**భూ భారతి దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ దృష్టి**



**జగిత్యేల, ఆగస్టు 18 (నేటి మన దేశమ్ ప్రతినిధి):** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన స్థలాలను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించిన కలెక్టర్.. అనంతరం కొడిమ్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు ప్రాంతాల్లోనూ ప్రజలకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.నూకపల్లి అర్బన్ కాలనీలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలకు విద్య, చిన్నారుల సంరక్షణతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్థలాల ఎంపిక, నిర్మాణ ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.అనంతరం కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్.. ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, గడ్డి తదితరాలను వెంటనే తొలగించాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ నూకపల్లి అర్బన్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాఠశాల, అంగన్వాడీ భవనాల ఏర్పాటుతో కాలనీ ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.కాలనీలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాల ఎంపిక అనంతరం తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు.అనంతరం కొడిమ్యాల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న అంశాలు, సాదా బైనామా దరఖాస్తులు, మీ సేవ ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పేరుకుపోనివ్వకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలకు సంబంధించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాస్తవ పరిస్థితులను గుర్తించి నివేదికలు సమయానికి సమర్పించాలని ఆదేశించారు.మీ సేవ ద్వారా జారీ చేయాల్సిన సర్టిఫికెట్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రజలకు అందించాలని అధికారులకు సూచించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించిన కలెక్టర్.. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లాలో ఒకవైపు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటూనే మరోవైపు భూ సమస్యలు, రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా శాఖల మధ్య సమన్వయంతో వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, హౌసింగ్ డీఈ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కొడిమ్యాల తహసీల్దార్ నరేష్, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వ సలహాధారు షబ్బీర్ అలీ కి వినతిపత్రం అందచేసిన ముదిరాజ్ సంఘం నాయకులు



**కామారెడ్డి,ఆగస్టు 18.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** బడుగు,బలహీన వర్గాల ఉన్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న విగ్రహం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసుకోవడానికి షబ్బీర్ అలీ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.నిజాం నిరంకుశ పాలనలో బూస్వాములు, పెత్తం దారులు రాజ్యం ఏలుతున్న రోజుల్లో అనగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడి,కుల మతాలకు అతీతంగా ఆడపిల్లల వివాహలు చేసి ప్రతీ కుటుంబంలో పెద్దన్న పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి పండుగ సాయన్న ముదిరాజ్ వర్గానికి చెందిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కేవలం 36 సంవత్సరాల కాలంలోనే బహుజన రాజ్యాధికారం కావాలని ఆశించిన వ్యక్తి అని, తనని చంపాలని బూస్వాములు పథకం వేస్తే సామాన్య ప్రజలందరూ కలిసి తిరగబడడం జరిగింది.అలాంటి గొప్ప వీరుడి వ్యక్తిత్వం బావితరాలకు తెలియాలని అన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో అత్యధిక జనాభా కలిగినటువంటి ముదిరాజ్ సామాజిక వర్గాల ఆత్మ గౌరవనికి సూచికగా జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలని నిశ్చయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ముదిరాజ్ నాయకులు ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పున్న రాజేశ్వర్,నీల నాగరాజు, గజ్జెల బిక్షపతి,నంద రమేష్, గేరిగంటి లక్ష్మి నారాయణ, సునుగూరి బానుప్రకాష్, దాకి అరవింద్,కాళ్ళ గంగారాజు,పిల్లి మల్లేష్, చింతల రమేష్, మోడేగామ్ మహేష్, బట్టు నర్సింలు, ప్రసాద్,బర్ల స్వామి,కనికంటి రమేష్,నర్సింలు,చిట్యాల రమేష్, పిట్ల శంకర్, కనకంటి రమేష్, నర్సులు,స్వామి, అంజి,శ్రీకాంత్,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మ్లలెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.







## డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు



తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

## ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్
### రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

## సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్– శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# బిజినెస్ న్యూస్



## టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. చరిత్రలో తొలిసారి




టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం అనుకున్నట్లుగానే వాయిదా పడింది. తగినంత కోరమ్ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. టాటా గ్రూపు కంపెనీలకు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ (ఘ్రు ఀశీఅం) చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. మళ్లీ ఎప్పుడు ఏజీఎం నిర్వహించాలనే అంశంపై బోర్డు సభ్యులతో ఛైర్మన్ సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోనున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18న బాంబే హౌస్‌లో నిర్వహించ తలపెట్టిన ఏజీఎంకు ఛైర్మన్ చంద్రశేఖరన్, కొందరు బోర్డు సభ్యులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. నోయల్ టాటా, మెహ్లీ మిస్త్రీ సహా మరికొందరు సైతం ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. అయితే, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నిషేధం కారణంగా టాటా సన్స్‌లో కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) తన ప్రతినిధిని నామినేట్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ట్రస్ట్ ప్రతినిధి గైర్హాజరీతో కోరమ్ లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఇదే విషయాన్ని మరో ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ ముందుగానే టాటా సన్స్‌కు తెలియజేసింది. దీంతో ఏజీఎం వాయిదా ముందుగా ఊహించినదే. వాస్తవానికి ఈ సమావేశంలో టాటా సన్స్‌కు ప్రస్తుత చంద్రశేఖరన్‌ను డైరెక్టర్‌గా రీనామినేట్ చేసే అంశం పరిశీలనతో పాటు, 2025–26 ఆర్థిక సంవత్సర స్టాండలోన్, ఏకీకృత ఖాతాలను పరిశీలించి, ఆమోదించాల్సి ఉంది. డివిడెండునూ ప్రకటించాల్సి ఉంది.

## వార్ ఎఫెక్ట్: పెరగనున్న కోల్గేట్ ధరలు




ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ కోల్గేట్–పామోలివ్ తన ఉత్పత్తుల ధరలను పెంచే యోచనలో ఉంది. రానున్న త్రైమాసికాల్లో ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముడిసరుకుల వ్యయం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకొనేందుకు ఈ ధరల పెంపు అనివార్యమైందని కంపెనీ పేర్కొన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. "గతేడాది జీఎస్టీ సవరణ వల్ల ఉత్పత్తుల బరువును పెంచాం. ప్రస్తుతం రూ.10, రూ.20 నుంచే కోల్గేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థి తులతో ముడి సరుకుల సరఫరాపై ప్రభావం పడుతోంది. ఇప్పుడు ధరలు పెంచకపోతే భవిష్యత్తులో ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని కంపెనీ సీఈవో అండ్ ఎండీ ప్రభా నరసింహన్ తెలిపారు. అలాగే, కంపెనీ టూత్ బ్రష్, టూత్ పేస్ట్ రెండింటిలోనూ ప్రీమియం ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కోల్గేట్–పామోలి వ్‌కు చెందిన పర్సనల్ కేర్ బ్రాండ్ పామోలివ్ మార్కెట్ పనితీరుపై ప్రభా నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకునేందుకు బాంబే షేవింగ్ కంపెనీతో జట్టు కట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ పతాంజలి, హేలియోన్ కంపెనీకి చెందిన సెన్సోడైన్, హిందూస్థాన్ యుని లీవర్‌కు చెందిన పెప్సోడెంట్ ఉత్పత్తులతో పోటీపడుతోంది.

## మన స్టాక్‌మార్కెట్‌ను కొల్లగొట్టిన జేన్‌స్ట్రీట్‌కు ఊహించని షాక్




'పొట్టోడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోచమ్మ కొట్టిందంట'.. సరిగ్గా ఈ సామెత అమెరి కాకు చెందిన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ జేన్‌స్ట్రీట్‌కు సరిపో తుందేమో. భారత స్టాక్ మార్కెట్‌ను కొల్లగొట్టి దేశం లో నిషేధం ఎదుర్కొన్న ఈ సంస్థకు.. వాల్‌స్ట్రీట్‌లో తాజా గా గట్టి షాక్ తగిలింది. నేరు గా ఈ కంపెనీ నష్టపోన ప్పటికీ.. నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ హెడ్జ్‌ఫండ్ భారీగా నష్టపోవడంతో జేన్‌స్ట్రీట్‌కూ భారీగానే నష్టం వాటిల్లింది. వక్రమార్గంలో భారత స్టాక్ మార్కెట్‌ను మోసం చేసిన ఈ సంస్థకు.. ఏడాది తిరగకముందే అంతకు రెండు, మూడింతలు నష్టపోవడం గమనార్హం. ఇంతకీ ఏం జరిగిందంటే? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడైన 24 ఏళ్ల లియోపోల్డ్ ఆస్చెన్‌బ్రెన్నర్ ఆస్చెన్‌బ్రెన్నర్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ పేరిట హెడ్జ్ ఫండ్‌ను స్థాపించాడు. 19 ఏళ్లకే కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడైన ఈయన.. గతంలో ఎఫ్‌టీఎక్స్, ఓపెన్‌ఏఐలలో పనిచేశాడు. అయితే, సెమీకండక్టర్ షేర్లపై సిట్యువేషనల్ అవేర్‌నెస్ పెట్టిన పెట్టుబడులు బెడిసికొట్టడంతో ఈ సంస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. దీంతో ఈ హెడ్జ్ ఫండ్‌లో పెట్టుబడులు కలిగిన జేన్‌స్ట్రీట్‌కూ భారీగా నష్టం వాటిల్లింది.

ఏం జరిగింది?

సిట్యువేషనల్ అవేర్‌నెస్ సంస్థ జూన్ నెలలో శాన్‌డిస్క్‌లో 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్లు చొప్పున పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర కుప్పకూలాయి. దీంతో కేవలం ఒక్క నెలలోనే పోర్ట్‌ఫోలియో విలువ దాదాపు 67 శాతం ఆవిరైంది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 10 శాతం వాటా కలిగిన బ్లూమ్ ఎనర్జీ షేర్లు కూడా అదే నెలలో 31 శాతం పడిపోయాయి. టీఎస్ఎంసీ, నెబియస్ షేర్లలో పెట్టిన పెట్టుబడులు కూడా నష్టాలను మిగిల్చాయి. ఫలితంగా 45 బిలియన్లుగా ఉన్న ఫండ్ విలువ దాదాపు 10 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ పతనం కారణంగా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ దాదాపు 15 బిలియన్ డాలర్లు నష్టపోయినట్లు తెలిసింది. అంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.1.25 లక్షల కోట్లకు పైమాటే.

ఇదీ జేన్ స్ట్రీట్ కథ

మన స్టాక్‌మార్కెట్‌లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించినట్లు తేలడంతో గతేడాది జులైలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. స్టాక్‌మార్కెట్లో ఇండెక్స్ (ఆయా రంగాల సూచీ) ధరలను ప్రభావితం చేసి, మదుపరుల సొమ్మును ఈ సంస్థ కొల్లగొట్టింది. దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ నిర్ధారించింది. కొన్నింట్లో వచ్చిన నష్టాలను మినహాయిస్తే నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించింది. దీంతో రూ.4,843 కోట్లు జరిమానాగా చెల్లించాలని సెబీ ఆదేశించింది. ఈ పరిణామం జరిగిన ఏడాది తర్వాత జేన్‌స్ట్రీట్‌కు తన పెట్టుబడుల రూపంలో భారీ మొత్తంలో నష్టం వాటిల్లడం కొసమెరుపు.

## యూట్యూబ్‌లో వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు




గూగుల్‌కు చెందిన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు తీసుకురాబోతోంది. వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే ఇకపై వీడియో వ్యూ కౌంట్ ప్రారంభవుతుంది. అన్ని ఫార్మాట్లకు వ్యూస్ లెక్కింపు విధానంలో ఏకరూపత ఉండాలన్న ఉద్దేశంతో ఈ మార్పు చేపడుతోంది. ఆగస్టు 24 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం అమల్లోకి రానుంది. యూట్యూబ్‌లో ప్రస్తుతం లాంగ్ ఫార్మాట్ వీడియోలను ఎవరైనా 30 సెకన్లు పాటు వీక్షిస్తేనే వ్యూగా లెక్కిస్తున్నారు. ఇకపై వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే వ్యూగా కౌంట్ చేస్తారు. యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ విధానాన్ని యూట్యూబ్ ఇప్పటికే అమలు చేస్తోంది. కొత్తగా లాంగ్ ఫార్మాట్ వీడియోలకూ వర్తింపజేయనుంది. వీడియో ప్లే అయిన వెంటనే, లేదా ఎవరైనా లైవ్‌స్ట్రీమ్‌లోకి ప్రవేశిం చిన వెంటనే ఇకపై పబ్లిక్ వ్యూ నమోదవుతుంది. కేవలం వీడియో ప్లే అయిన తర్వాత చూసి వెళ్లిపోయిన వారిని, ఎక్కువ సమయం చూసిన వారిని వేర్వే రుగా చూపించేందుకు యూట్యూబ్ అనలిటిక్స్‌లో 'ఎంగేజ్డ్ వ్యూస్' ఆప్షన్‌ను ఉంటుంది. దీనిద్వారా నిజంగా తమ కంటెంట్‌ను ఎంతమంది చూస్తున్నారో క్రియేటర్లు తెలుసుకోగలుగుతారు. అయితే, ఈ మార్పు వల్ల ఆదాయం, మానిటైజేషన్‌పై ఎలాంటి ప్రభావం ఉండబో దని యూట్యూబ్ స్పష్టంచేసింది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌ను అనుసరించే చెల్లింపులు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ఈ మార్పు వల్ల యూజర్లకు వచ్చే ప్రయోజనం ఏమీ లేనప్పటికీ.. క్రియేటర్లకు మాత్రం ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

# శ్రావణమాసం తొలి మంగళవారం.. కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

కలువ పుష్పాలతో అమ్మవారి అలంకరణ.. భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం



**మల్కాజిగిరి, ఆగస్టు18 (నేటి మనదేశమ్):** :శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా మల్కాజిగిరిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం తొలి మంగళవారం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, అనంతరం కలువ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రావణమాసంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం వల్ల కుటుంబానికి సుఖశాంతులు, సౌభాగ్యం కలుగుతాయని భక్తులు విశ్వసించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి మర్రి మమతారెడ్డి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారికి పూజా కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ఎమ్మెల్యే దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంజుల జగదీష్‌గౌడ్, మేకల సునీత రాము యాదవ్, శిరీష జితేందర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సురేష్‌గుప్తా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భక్తులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. శ్రావణమాసం తొలి మంగళవారం సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

# సాగునీటి అవసరాలకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార దీపక్**



**మంచిర్యాల, ఆగస్టు 18, నేటి మనదేశమ్:** ఎల్ నినో నేపథ్యంలో రైతులు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలంలో గల గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భీమారం మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదిత భూమి, మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనం పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విలువైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే రీతిగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడి వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలు, పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సదానందం, ఆర్.ఐ. రజిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**మంచిర్యాల, ఆగస్టు 18, నేటి మనదేశమ్:** జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో బి సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సంబంధిత మండలాల తహసిల్దార్లు, జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వసూలు చేసే అంశంపై సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌లోని నిబంధనలు, బకాయిల వసూళ్లకు అనుసరించవలసిన విధివిధానాలు, మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న బకాయిల మొత్తాలపై రికన్సిలియేషన్, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి రావలసిన బకాయిలను పూర్తి స్థాయిలో గుర్తించి, సంబంధిత రికార్డులను సరి చూసి, నిబంధనల ప్రకారం వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కోర్టు కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు, పెండింగ్ అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి కంటి పరీక్షలు



**నేరేడ్‌మెట్, ఆగస్టు18 (నేటి మనదేశమ్):** విద్యార్థులు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డా. బండి రాజు మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా దృష్టి లోపాలను నివారించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు కంటి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.శిబిరంలో వైద్య నిపుణులు దృష్టి సామర్థ్యాన్ని పరీక్షించడంతో పాటు కంటి సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు సమగ్ర పరీక్షలు నిర్వహించారు. కంటిశుక్లం, గ్లాకోమా తదితర సమస్యలకు సంబంధించి ప్రత్యేకంగా పరీక్షలు చేశారు. కంటి సంరక్షణ, పరిశుభ్రత, రోజువారీ జీవితంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. పరీక్షల్లో సమస్యలు గుర్తించిన వారిని తదుపరి చికిత్స కోసం ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు.కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో ఆనంద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. అడవి రాజు, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డా. కదిరి హరిత, డా. ఎడ్ల ప్రదీప్, విద్యా సమన్వయకర్తలు గుణాకర్, డా. మల్లిక, అంతర్గత నాణ్యత హామీ విభాగం సమన్వయకర్త డా. రాజేశ్‌కుమార్, ప్రొఫెసర్ వెంకటరెడ్డి, డా. యాదగిరి, డా. లలిత, స్వాతి, శైలజ తదితర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు..



**నిర్మల్, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట పటిమ, ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగాలు, సేవలను నిరంతరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.మొఘల్, కుతుబ్ షాహీ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను, బహుజనులను ఏకం చేసి పాపన్న గౌడ్ సైన్యాన్ని తయారు చేశారని అన్నారు. పాపన్న గౌడ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. అందరం ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు అమరవేణి నర్సగౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటాలు గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఆయన తెగువ నేటి తరాలకు ఆదర్శమని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్సి కార్పొరేషన్ శంకర్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, ఆగస్టు 18, నేటి మనదేశమ్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే లతో కలిసి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కష్టపడి పనిచేసి చిన్న చిన్న లక్ష్యాలను సాధిస్తూ పెద్ద లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. మనమంతా ఐక్యంగా ఉన్నంతకాలం అభివృద్ధి వైపు ముందుకు సాగగలుగుతామని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ద్వారా ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చనే సందేశం తెలుస్తుందని, పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మహానుభావుల ఆశయాలు, ఆచరణాత్మక పద్ధతులు భావితరాలకు తెలిసే విధంగా మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వెనుకబడిన తరగతులు, గౌడ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, ఆగస్టు18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** :ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మా కంపెనీ, సి.ఎస్..ఆర్. నిధులతో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి 25 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణంతో ఇందాని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ప్రతినిధి లోకేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిర్మల, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి..

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహించిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమైనవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని చెప్పారు. లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని శాస్త్ర సాంకేతిక రంగాల్లో గొప్పగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకునేందుకు అన్ని వనరులను సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. విద్య పూర్తికాకముందే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా తగిన అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్యూక్షైర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు వర్క్ ఇన్స్పెక్టర్లు డాక్టర్ డ్రైవర్లకు మరియు ఇతర వర్కర్లకు పాత జీవో అమలు చేయాలి

**కార్మిక శాఖ మంత్రికి, వినతి పత్రం అందజేసిన -ఆర్ మధుసూదన్ రెడ్డి షేక్ యాకుబ్ షావలి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 18:( నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లామున్సిపల్ కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లకు, పాత జీవో అమలు చేయాలి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి ఇతర సమస్యలు, పరిష్కరించి, పెనాల్టీ రద్దు చేయాలి, ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలో, 30 మందికి జీతాలు వేయాలి ఉద్యోగ భద్రత కల్పించాలి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ మధుసూదన్ రెడ్డి షేక్ యాకుబ్ షావలి, మణుగూరుతెలంగాణ రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వివేక్, ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) వచ్చిన సందర్భంగా వారు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మంత్రి కి వివరిస్తూ, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని మూడు జోన్లుగా కార్పొరేషన్లు మున్సిపాలిటీ గ్రామీణ ప్రాంతం, అన్ స్కిల్డ్ సెమి స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్, జీతాలు పెంచినమని, జీవో నెంబర్ 6, తెచ్చారు. దీని ద్వారా మున్సిపాలిటీలో ఎంతో కాలం నుండి పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు,వర్క్ ఇన్స్పెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, వేతనాలు 5,000 నుండి 1,000 రూపాయల వరకు తగ్గించారు

# 'ఎమ్మెల్యే సంజయ్‌కు చూపు మందగించింది'

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు చూపించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తాం..**
**కోరుట్ల కాంగ్రెస్ నేతల ఎద్దేవా**
**జువ్వాడి కృష్ణారావు ఎవరో తెలియదనడం ఎమ్మెల్యే విజ్ఞతకే వదిలేస్తున్నాం**
**అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకోవాలి.. కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక**



**కోరుట్ల, ఆగస్టు 18(నేటి మన దేశమ్ ప్రతినిధి):** కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు చూపు మందగించినట్లుందని, అందుకే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్‌కు చూపించి అవసరమైతే ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు అన్నారు.కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్‌లో మంగళవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంఏ నయీమ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

**కృష్ణారావు ఎవరో తెలియదనడం విడ్డూరం** కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఎవరో తనకు తెలియదన్నట్లుగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నేతలు అన్నారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తిగా కృష్ణారావుకు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు తనయుడిగా, ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్‌గా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా కృష్ణారావు చేసిన సేవలు నియోజకవర్గ ప్రజలకు తెలుసని అన్నారు. ఆయనకు కోరుట్ల పట్టణంలో సొంత ఇల్లు ఉందని, ఆయన ఓటు కూడా కోరుట్ల నియోజకవర్గంలోనే ఉందని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఎవరో తెలియదని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు.

**ముత్యంపేట కోసం పాదయాత్ర చేసిన నాయకుడు** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూతపడిన ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపించాలనే డిమాండ్‌తో గతంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలను కలుపుకుని ప్రతి నెల 22వ తేదీన ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు జువ్వాడి కృష్ణారావు పాదయాత్ర చేపట్టారని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేశారు.ప్రజా సమస్యల కోసం రోడ్డుపైకి వచ్చి పోరాటాలు చేసిన వ్యక్తి గురించి ఎమ్మెల్యేకు తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృష్ణారావు నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నారని తెలిపారు.

**రత్నాకర్‌రావు హయాంలోనే అభివృద్ధి** కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే అందుకు ప్రధాన కారణం స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధి పనులేనని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, రైతులు, మహిళలు, యువత, పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

**బీడీ కార్మికుల పెన్షన్లపై విమర్శలు** బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. 2014లో బీడీ పెన్షన్ కటాఫ్ విధించి, 2016లో ఒక్కసారి పెన్షన్ ఇచ్చి ఆ తర్వాత పూర్తిస్థాయిలో కొనసాగించని వారు ఇప్పుడు ప్రజల కోసం ధర్నాలు, ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో భారీ అవినీతి జరిగిందని, ప్రజాధనం దుర్వినియోగమైందని వారు విమర్శించారు.

**'మట్టప్ప చూపులా వచ్చి వెళ్లడం కాదు'** నియోజకవర్గ ప్రజలతో నిరంతరం మమేకమై ఉండాల్సిన ప్రజాప్రతినిధి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. నియోజకవర్గానికి చుట్టపు చూపులా వచ్చి వెళ్లడం కాకుండా ప్రజల మధ్య ఉండి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు.ఎవరికి ఏ కష్టం వచ్చినా 'తానున్నానంటూ' ముందుకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న జువ్వాడి కృష్ణారావు గురించి 'ఎవరో తెలియదు' అని వ్యాఖ్యానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేయలేదని విమర్శ** రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న సమయంలో, కోరుట్ల నియోజకవర్గంలో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే కనీసం పూలమాల వేసి నివాళులు అర్పించకపోవడం బాధాకరమని కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్రజా నాయకుల సేవలను గుర్తించడంతో పాటు సామాజిక వర్గాల గౌరవాన్ని కాపాడేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు.

**'మరోసారి మాట్లాడితే ఊరుకోం'** అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకొని ప్రజలకు ఉపయోగపడే పనులపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న జువ్వాడి కృష్ణారావుపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్‌రెడ్డి, కిసాన్ సెల్ నాయకులు శంకర్‌గౌడ్, నాయకులు సురేష్, నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో,చట్టాల అమలులో రాజీ పడొద్దు

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**



**పెద్దపల్లి ఆగస్టు18 (నేటి మనదేశమ్):** శాంతిభద్రతల పరిరక్షణలో,చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి సీపీకి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఏసీపీ కార్యాలయంలోని వివిధ రికార్డులను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు, వాటి పురోగతి, నిందితుల అరెస్టులు,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు,పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను ఏసీపీ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు.రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి,వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సివిల్, భూవివాదాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకుండా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరించాలని సీపీ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడంతో పాటు, ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీ అనంతరం పోలీసు అధికారులతో కలిసి ఏసీపీ కార్యాలయ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు,ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు

# మాణిక్ ప్రభు మందిరం ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (నేటి మనదేశమ్)** సంగారెడ్డి పట్టణంలోని మాణిక్య ప్రభు మందిరం ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్ గా తోపాజి అనంత కిషన్, అధ్యక్షునిగా అమేటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గా కొవ్వూరు హనుమంతు, కోశాధికారిగా నాయి కోటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అశోక్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్ గౌడ్, కొండాపురం జగన్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పరమేశ్వర్ గౌడ్, గుండ్లపల్లి నరేష్ కుమార్, సహాయ కా దర్శులుగా నామ శ్రీనివాస్, అమేటి రాజేంద్ర ప్రసాద్,గౌరవ అధ్యక్షులుగా ఆమెటి మహేందర్, సలహాదారులుగా మిఠాయి నారాయణ, ఆమెటి ప్రభులింగం, కొంపల్లి విద్యా సాగర్, పంపాటి కృష్ణ మూర్తి, ప్రహ్లాద్, అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా సురేష్, బలవంతరావు, ర్యాకల సంతోష్ కుమార్, కాంశెట్టి శంకర్, శంకర్, వెంకట్, మధు, పెంటయ్య, అనుముల సంతోష్, శేఖర్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు ఆమెటి కృష్ణ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో కృషి చేస్తారని చెప్పారు.

# పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రలను అడ్డుకుంటాం:

## ఎమ్మెల్యే చింత ప్రభాకర్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (నేటి మనదేశమ్)** తెలంగాణలో పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసి రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ... హైకోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.కేసీఆర్ ఒక మేనమామలా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచారు. దాదాపు 3 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు సుమారు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారు. కోవిడ్ వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయంలో కూడా పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అండగా నిలిచింది" అని అన్నారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వల్ల పేద కుటుంబాల్లో పెళ్లి భారం తగ్గిందని, అనేకమంది ఆడబిడ్డలు తమ విద్యను కొనసాగించేందుకు కూడా అవకాశం ఏర్పడిందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలిచిందన్నారు. ఈ పథకానికి జాతీయస్థాయిలో కూడా ప్రశంసలు లభించాయని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మితో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకపోగా, ఇప్పటికే అమల్లో ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల భవిష్యత్తునే ప్రశ్నార్థకం చేసింది" అని చింత ప్రభాకర్ మండిపడ్డారు.కళ్యాణ లక్ష్మి ఏమైంది? షాదీ ముబారక్ ఏమైంది? పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తుదారులకు ఆర్థిక సహాయం ఎప్పుడు అందిస్తారు? ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం ఎప్పుడు ఇస్తారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అనేకమంది లబ్ధిదారులు తమకు రావాల్సిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సాయం కోసం ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ...కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ఉండకూడదు, ప్రజలకు మేలు జరగకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేసేందుకు కుట్ర చేస్తోంది" అని ఆరోపించారు.ప్రభుత్వం కావాలనే కేసు విషయంలో సరైన విధంగా స్పందించకుండా ఇప్పుడు హైకోర్టు తీర్పును సాకుగా చూపిస్తోందని విమర్శించారు.కళ్యాణ లక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణం. పలుమార్లు గడువు లభించినప్పటికీ ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదు? పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన ఇంత కీలకమైన పథకం విషయంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేదు?" అని ప్రశ్నించారు.మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.ముఖ్యమంత్రి, మంత్రులు లేదా ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో ప్రైవేట్ న్యాయవాదుల సేవలు తీసుకునే ప్రభుత్వం, పేద ఆడబిడ్డల హక్కులకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి విషయంలో మాత్రం ఎందుకు సరిగ్గా స్పందించలేదు?" అని ప్రశ్నించారు.ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేసి, ఇప్పుడు హైకోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ పథకాన్ని నిలిపివేసిందని ఆరోపించారు.లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఇలాంటి పథకాలను రద్దు చేసే ప్రయత్నాలను అడ్డుకోవడం ప్రతిపక్షంగా మా బాధ్యత. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆ హామీని అమలు చేయకుండా ఇప్పుడు పేద ఆడబిడ్డలను మోసం చేస్తోంది" అని అన్నారు.కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసే ప్రయత్నం చేస్తే పేద ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారు" అని చంటి క్రాంతి కిరణ్ హెచ్చరించారు.కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి.. పేదింటి ఆడబిడ్డల హక్కులను కాపాడాలి.. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలి అని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు..

# ఘనంగాసర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌లిజయంతి వేడుకలు

**బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం - అడిషనల్ కలెక్టర్ పాండు**



**సంగారెడ్డి,జిల్లా ప్రతినిధి ఆగస్టు 18:-( నేటి మన దేశమ్)** సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ పాండు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల కోసం ధైర్యంగా నిలబడిన ఆయన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను పెంచుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**స్వయం పాలనకు పునాది వేసిన సర్దార్ సర్వాయి పాపన్న: జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, ఆగస్టు 18 (నేటి మన దేశమ్ ప్రతినిధి):** కోరుట్ల పట్టణంలో మంగళవారం పలు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒకవైపు వన మహోత్సవంలో భాగంగా పలు వార్డుల్లో మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, మరోవైపు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

**పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కలిసి వార్డు ప్రజలకు మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.చెట్లను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. 'పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు' అనే భావనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను స్వీకరించారు.

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి** కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్వయం పాలనకు పునాది వేసిన గొప్ప యోధుడని అన్నారు. పాపన్న పోరాటం కేవలం మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా ప్రజలను దోపిడీ చేస్తున్న ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిందన్నారు.రాజాధికారం ప్రధానంగా వంశపారంపర్యంగా కొనసాగుతున్న కాలంలో సామాన్య శ్రమజీవి సామాజిక వర్గానికి చెందిన పాపన్న ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించడం చరిత్రలో విప్లవాత్మక పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణ నేల గర్వించదగ్గ వీరుడు, బీసీల ముద్దుబిడ్డగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిలిచిపోయారని అన్నారు.అన్యాయంపై పోరాడిన యోధుడిగా, సమానత్వం కోసం త్యాగాలు చేసిన మహనీయుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సమానత్వం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కిసాన్ సెల్ నాయకులు శంకర్ గౌడ్, నాయకులు నజ్జు నర్సారెడ్డి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక

**- కీలక పదవుల్లో కొత్త నాయకత్వం**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 18: నేటి మన దేశమ్ ప్రతినిధి** రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఎన్నికలను ఎన్నికల నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు ఆర్ఐ అడ్మిన్ పర్యవేక్షణలో నిర్వహించారు.ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు జరిగిన ఎన్నికలను పరిశీలించిన ఎస్పీ, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.అధ్యక్షుడిగా వేములవాడ టౌన్ కానిస్టేబుల్ ఎస్ గోపాల్, ఉపాధ్యక్షులుగా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి. రవి, వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం, కార్యదర్శిగా సిరిసిల్ల రూరల్ సీఐ కె నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా గంభీరావుపేట కానిస్టేబుల్ డి శ్రీనాథ్‌రాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఎం ప్రకాష్, కోశాధికారిగా జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది ఏ వేణు ఎన్నికయ్యారు.ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ముస్తాబాద్ కానిస్టేబుల్ కె. గోపాల్, ఎల్లారెడ్డిపేట కానిస్టేబుల్ ఏ. శ్రీనివాస్, బోయినపల్లి కానిస్టేబుల్ ఏ. సుధాకర్, తంగళ్లపల్లి హెడ్ కానిస్టేబుల్ పద్మ, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లు గడ్డం మహేష్, బి. తిరుపతి ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# మొండికుంట చింతకుంట గ్రామంలో 30 నిరుపేద కుటుంబాలకు సహాయ సామగ్రి పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 18: పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)** అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: మారుమూల గిరిజన ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో లిటిల్ కాజ్ సొసైటీ( ఎన్జీవో) ఆధ్వర్యంలో ఈరోజు మొండికుంట చింతకుంట గ్రామంలో 30 కుటుంబాలకు సహాయ సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ పాల్గొని కుటుంబాలకు సహాయ సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిటిల్ కాజ్ సొసైటీ ఎన్జీవో డైరెక్టర్ నిదానపల్లి ప్రసాద్, కో-ఆర్డినేటర్ పాడిగ నారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిదానపల్లి ప్రసాద్ మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారి అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

## నేతాజీకి సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఘన నివాళి



**మహబూబ్‌నగర్ ఆగష్టు18 (నేటి మనదేశమ్):** ఆజాద్ హింద్ ఫౌజ్, వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీ డీకే అరుణ ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఈ సందర్భంగా ఆమె స్మరించుకున్నారు.దేశ విముక్తి కోసం ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని డీకే అరుణ కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, సాహసం, దేశభక్తి ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమన్నారు.నేతాజీ ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని మరింత బలోపేతం చేసి, ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు, త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు

## కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**మహబూబ్‌నగర్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి: మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్**




**మహబూబ్‌నగర్ ఆగష్టు18 (నేటి మనదేశమ్):** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేసేందుకు జరుగుతున్న కుట్రలను వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం హామీని కూడా అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులకు సంబంధించి చెల్లింపులు జరగకపోవడంపై ఆయన విమర్శలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.మహిళలకు పెంచిన పింఛన్లు, విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కేసీఆర్ కిట్, రైతు బీమా వంటి పథకాలను కూడా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించి, గతంలో అమలు చేసిన విధానాన్ని కొనసాగించాలని కోరారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి పాపన్న గౌడ్

**సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం**

**మహబూబ్‌నగర్‌లో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు**



**మహబూబ్‌నగర్ ఆగష్టు18 (నేటి మనదేశమ్):** బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ బహుజన రాజ్యాధికార పోరాట యోధుడని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ప్రజల కోసం చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ జాబితా నుంచి భూములు తొలగించాలి

**కాలనీలకు కాలనీలనే నిషేధిత జాబితాలోకి ఎలా చేర్చారు?**

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా ప్రభుత్వమే పరిష్కరించాలి: హరీశ్‌రావు**



**నేరేడ్‌మెట్, ఆగష్టు18 (నేటి మనదేశమ్):** 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూములను తక్షణమే తొలగించి, ప్రజలకు క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో 22ఏ జాబితా కారణంగా సుమారు 30 వేల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.రిజిస్ట్రేషన్‌కు వెళ్తేనే విషయం తెలుస్తోందిఏళ్ల తరబడి ప్రజలు హక్కులతో అనుభవిస్తున్న భూములను అవసరాల కోసం విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లినప్పుడు 22ఏ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోందని హరీశ్‌రావు అన్నారు. పిల్లల వివాహాలు, ఉన్నత విద్య, వైద్యం వంటి అత్యవసర అవసరాలకు సొంత ఆస్తులను విక్రయించుకోలేక ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా కాలనీలకు కాలనీలనే నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇన్నేళ్లుగా లేని సమస్య ఇప్పుడెందుకు?** 2008లో అప్పటి ప్రభుత్వం పట్టణ భూముల పరిమితి చట్టాన్ని రద్దు చేసిన అనంతరం అనేక భూములు పట్టా భూములుగా మారాయని, ప్రజలు ఏళ్లుగా వాటిపై హక్కులతో నివసిస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇన్నేళ్లుగా ఎలాంటి సమస్య లేని భూములను ఇప్పుడు 22ఏ జాబితాలోకి చేర్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.తిలక్‌నగర్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి 450 గజాల ఇంటిని విక్రయించేందుకు వెళ్లినప్పుడు అది నిషేధిత జాబితాలో ఉన్నట్లు తెలిసిందని ఉదాహరణగా చెప్పారు. ఇలాంటి సమస్యలను అనేక మంది సామాన్యులు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**కొత్త దరఖాస్తులు వద్దు** ప్రభుత్వమే భూములను పరిశీలించి అర్హత ఉన్న వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకుని వారిని కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. 22ఏ జాబితాలో చేర్చిన భూములు, తొలగించిన భూముల పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడిస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహాయ నంబర్ సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ పోరాటం22ఏ భూముల సమస్యపై అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజల ఆస్తుల హక్కులను కాపాడేందుకు తమ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమస్యకు బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, 22ఏ బాధితులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ ఆశయాలు స్ఫూర్తిదాయకం.....

**ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు.....**

**విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**




**మల్కాజ్‌గిరి, ఆగష్టు18 (నేటి మనదేశమ్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేరేడ్‌మెట్ చౌరస్తా, మల్కాజ్‌గిరిలోని యాదవ్‌నగర్‌లో ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ప్రజల కోసం ఆయన చేసిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు నరసింహ గౌడ్, సదానందం గౌడ్, జె.కె. సాయి గౌడ్, సుమన్ గౌడ్, అనిల్ కిషోర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, గంగాధర్ గౌడ్, నవీన్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, బలరాజ్ గౌడ్, నరహరి గౌడ్, కృష్ణ గౌడ్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, శిరీష, జితేందర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ అర్బన్ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ధనలక్ష్మి



**నేరేడ్‌మెట్, ఆగష్టు18 (నేటి మనదేశమ్):** బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సీనియర్ నాయకురాలు ఎస్. ధనలక్ష్మి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ఆదేశాల మేరకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తానన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజల్లో ఉంటూ పోరాడుతానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి మేడ్చల్ అర్బన్ జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ధనలక్ష్మి నియామకంపై పార్టీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతర కృషి

**అర్హులైన జర్నలిస్టులకు నివేషణ స్థలాల కోసం ఉద్యమం**

**హెల్త్ కార్డులను వెంటనే అందించాలి**

**పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల సమస్యను పరిష్కరించాలి**

**జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 18: నేటి మన దేశమ్ ప్రతినిధి** జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, స్వేచ్ఛ పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతరం పోరాడుతుందని జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా అన్నారు. అల్లం నారాయణ, మారుతి సాగర్‌ల సారథ్యంలో సిరిసిల్ల పట్టణంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జర్నలిస్టులకు నివేశన స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ కారణాల చేత అసువులు బాసిన జర్నలిస్టు ల కుటుంబాలకు మీడియా అకాడమీ ద్వారా ఆర్థిక సహాయం, పెన్షన్ అందించే కార్యక్రమంలో సంఘం ముందుండి పనిచేస్తుందని గుర్తు చేశారు.ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ టీయూడబ్ల్యూజే హెచ్-143 అధ్యక్షుడిగా పరకాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రఘువీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను జిల్లా కమిటీ, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. యూనియన్ బలోపేతంతో పాటు సభ్యుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించేందుకు ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సామల గట్టు, కోశాధికారి సయ్యద్ ఖలీమ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సల్మాన్, మల్లికార్జున్, దారం కృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు కంటాల విజయ్, మాజీ పట్టణ అధ్యక్షుడు రామనాథం సీనియర్ పాత్రికేయులు చిలుక సత్యనారాయణ, నాగరాజు, బి. శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, భాస్కర్, రఫీ, అస్లాం లతో పాటు జిల్లా నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్కాజిగిరి బీఆర్ఎస్‌కు షాక్

## మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలు






**మల్కాజిగిరి, ఆగష్టు18 (నేటి మనదేశమ్):** మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్‌కు చెందిన ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో వీరంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో నరసింహస్వామి దేవాలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు జీ. కృష్ణగౌడ్, జీ. జగమేష్‌గౌడ్, జీ. ఎల్లేష్, కే. శ్రీనివాస్‌రెడ్డి, ఏ. శ్రీనివాస్‌గౌడ్, మొగెందర్, దేవి, ఈశ్వర్, బాలరాజ్, సూరి, మల్లారెడ్డి, సాయి చారి, షేక్ అబ్బాస్, అబ్బన్న, నరసింహ, స్వామికుమార్, సైదులు, రాజు, విక్రమ్, రాజేష్, బోర్‌వెల్ శ్రీనివాస్, వెంకట్, రాజ్, లక్ష్మణ్ నాయక్‌తో పాటు పలువురు ఉన్నారు.పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడంతో మల్కాజిగిరి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయనే చర్చ ప్రారంభమైంది. రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# టెక్నాలజీ ఆధారిత తయారీ ప్లాట్‌ఫామ్ జెట్‌వర్క్, ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 2,600 కోట్లు సమీకరించేందుకు యూడీఆర్‌హెచ్‌పీని దాఖలు చేసింది.

**– పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసారం మరియు ఏఐ మౌలిక సదుపాయాల రంగాలలో వృద్ధి కారణంగా, 2026 ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 40.43% పెరిగి ?15,913 కోట్లకు చేరింది.**

**– 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2026 ఆర్థిక సంవత్సరంలో తయారీ ఆర్డర్‌బుక్ రెట్టింపు అయి ?12,370 కోట్లకు చేరింది; 2026 ఆర్థిక సంవత్సరంలో తయారీ వ్యాపార ఆదాయంలో అంతర్జాతీయ మార్కెట్ల వాటా దాదాపు 30%గా ఉంది.**

**విశాఖపట్నం, ఆగస్టు 18 నేటి మనదేశమ్ :** భారతదేశంలో మరియు ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక మరియు వినియోగదారుల వస్తువుల కోసం సాంకేతికత ఆధారిత, తక్కువ ఆస్తులతో కూడిన తయారీ వేదిక అయిన జెట్‌వర్క్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (రాజుదీ×)కి తన నవీకరించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (UDRHP)ను దాఖలు చేసింది. ఈ కంపెనీ, తన సొంత సాంకేతిక వెన్నెముక అయిన జెట్‌వర్క్ ఞూ ద్వారా ఏకీకృతం చేయబడిన "యూనివర్సల్ ఫ్యాక్టరీ"గా, థర్డ్-పార్టీ సరఫరాదారుల నెట్‌వర్క్ మరియు తన సొంత సౌకర్యాల నుండి తయారీ సామర్థ్యాన్ని సమీకరిస్తుంది. దీని వినియోగదారులు యుటిలిటీస్, పునరుత్పాదక ఇంధనం, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏరోస్పేస్, స్పేస్ ఙ డిఫెన్స్, ఆయిల్ ఙ గ్యాస్ మరియు ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగాలలో విస్తరించి ఉన్నారు. జెట్‌వర్క్ రెండు నివేదించదగిన వ్యాపార విభాగాలను నిర్వహిస్తుంది: ఒకటి మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్, ఇది తన సరఫరాదారుల నెట్‌వర్క్ మరియు సొంత సౌకర్యాల ద్వారా పారిశ్రామిక మరియు వినియోగదారుల ఉత్పత్తులను తయారు చేయడానికి వినియోగదారులకు వీలు కల్పిస్తుంది; మరియు రెండవది ఎకోసిస్టమ్ బిజినెస్, దీనికి టెర్రా91 అని పేరు పెట్టారు, ఇది వినియోగదారుల కోసం పారిశ్రామిక వస్తువులను సమీకరించి, సరఫరా చేస్తుంది. ప్రధాన విభాగాలపై దృష్టి పెట్టడానికి చేసిన వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణలో భాగంగా, మూడవ విభాగమైన సివిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను FY26లో నిలిపివేశారు. ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లో, ఒక్కో షేరు ముఖ విలువ 1 చొప్పున గరిష్టంగా రూ. 2,600 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా జారీ మరియు విక్రయించే వాటాదారుల ద్వారా ఒక్కో షేరు ముఖ విలువ రూ.1 చొప్పున గరిష్టంగా 96,837,455 ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉంటాయి. జెట్‌వర్క్, వచ్చిన నికర ఆదాయాన్ని ప్రధానంగా అప్పులు తీర్చడానికి (కంపెనీలో రూ.1,250 కోట్లు మరియు అనుబంధ సంస్థలలో రూ.550 కోట్లు) ఉపయోగించాలని యోచిస్తోంది. మిగిలిన మొత్తాన్ని, గుర్తించని కొనుగోళ్ల ద్వారా అకర్బన వృద్ధికి మరియు సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు కేటాయించనుంది. జెట్‌వర్క్ ఓఎస్, ఉత్పత్తి చక్రాలను వేగవంతం చేయడానికి ఒకే ఆర్డర్‌ను పలు కేంద్రాలలో సమన్వయం చేస్తుంది. ఇది కీలక నిర్ణయాలను స్వయంచాలకం చేస్తుంది మరియు తయారీ జీవనచక్రంలోని ప్రతి దశను ప్రామాణీకరించే, వికేంద్రీకృత తయారీకి మద్దతు ఇచ్చే సాంకేతికతతో మాన్యువల్ ప్రక్రియలను భర్తీ చేస్తుంది. మార్చి 31, 2026 నాటికి, జెట్‌వర్క్ యొక్క మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాట్‌ఫామ్ స్టార్టప్‌ల నుండి పెద్ద పారిశ్రామిక కంపెనీల వరకు విభిన్నమైన కస్టమర్ బేస్‌ను కలిగి ఉంది. ఇందులో సెన్సెక్స్‌లోని 8, నిఫ్టీ 50లోని 16, మరియు భారతదేశంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలలో 102 కంపెనీలు ఉన్నాయి. దీని కస్టమర్లలో సిమెన్స్ గేమ్సా, ఏసర్ ఇండియా, నెక్స్ట్‌పవర్, సీజీ పవర్, ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎల్‌డటి ఎంహెచ్‌ఐ పవర్ బాయిలర్, డీఆర్‌డీఓ, నాల్కో, ఐఓసీఎల్, మోర్టెన్‌సన్, నార్డెక్స్ యాక్సియోనా, భారత వైమానిక దళం మరియు నుమాలిగఢ్ రిఫైనరీ లిమిటెడ్ వంటివి ఉన్నాయి.

# క్రోమా యొక్క కొత్త ప్రచారం 'ఘర్ బంతా హై క్రోమా సే'

## ఇళ్లను గృహాలుగా మార్చే అందమైన క్షణాలను వేడుకగా జరుపుకుంటుంది




**విశాఖపట్నం, ఆగస్టు 18 నేటి మనదేశమ్ :** టాటా గ్రూప్‌కు చెందిన, భారతదేశపు విశ్వసనీయ ఓమ్ని-ఛానల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన క్రోమా, భారతీయ కుటుంబాలతో తనకున్న గాఢమైన అనుబంధాన్ని, అలాగే ఒక ఇంటిని గృహంగా మార్చే సంబంధాలు, సంభాషణలు మరియు జ్ఞాపకాలను వేడుకగా జరుపుకుంటూ 'ఘర్ బంతా హై క్రోమా సే' ప్రచారాన్ని ప్రారంభించింది. ఆధునిక భారతీయ గృహం వేగంగా పరిణామం చెందుతోంది. గృహోపకరణాలు మరియు ఎలక్ట్రానిక్స్ ఇకపై కేవలం ఆకాంక్షించే విలాస వస్తువులు కావు; అవి జీవనశైలి, సౌకర్యం మరియు సౌలభ్యాన్ని తీర్చిదిద్దే అత్యవసర జీవనాధారాలుగా మారాయి. ఈ పరివర్తన నేపథ్యంలో, ఈ ప్రచారం క్రోమా పాత్రను కేవలం ఒక లావాదేవీల రిటైలర్‌గా మాత్రమే కాకుండా, జీవితంలోని కీలక ఘట్టాలలో కుటుంబాలకు మార్గనిర్దేశం చేసే ఒక విశ్వసనీయ సలహాదారుగా కూడా హైలైట్ చేస్తుంది. "మా 20 ఏళ్ల ప్రయాణంలో, లక్షలాది భారతీయ గృహాలలోకి ప్రవేశించి, సాంకేతికత రోజువారీ కుటుంబ జీవితంలో ఎలా భాగమైందో ప్రత్యక్షంగా చూసే అదృష్టాన్ని క్రోమా పొందింది," అని క్రోమా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అమిత్ అగర్వాల్ అన్నారు. "ప్రతి మొదటి ఇల్లు, ప్రతి వేడుక, మరియు ప్రతి కుటుంబ భోజనం ఒక కథను చెబుతుంది. క్రోమాలో, మా వినియోగదారుల కోసం ఎలక్ట్రానిక్స్ యాజమాన్యాన్ని సులభతరం చేయడమే మా లక్ష్యం, ఇది మేము చేసే ప్రతి పనికి కేంద్రంగా ఉంది. వారి అవసరాలకు ఉత్తమంగా సరిపోయే సరికొత్త, జీవితాన్ని మెరుగుపరిచే సాంకేతికతను వారికి అందించడం ద్వారా మా వినియోగదారుల ముఖాలపై ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకురావడమే మా ధ్యేయంగా ఉంది. ఈ కథలకు మరియు సౌకర్యం, అనుబంధం, మరియు శాశ్వతమైన జ్ఞాపకాలతో నిండిన గృహాలను సృష్టించడంలో వినియోగదారులకు సహాయపడటానికి మేము పోషిస్తున్న ప్రత్యేక పాత్రకు 'ఘర్ బంతా హై క్రోమా సే' మా నివాళి." వినియోగదారులు కలలు కనే గృహాలను నిర్మించుకోవడంలో సహాయపడే విశ్వసనీయ భాగస్వామిగా క్రోమా స్థానాన్ని బలోపేతం చేయడానికి ఈ ప్రచారం ఒక నూతన వాగ్దానం. ప్రత్యేక ఆఫర్లు మరియు క్యూరేటెడ్ ప్యాకేజీలతో, 'ఘర్ బంతా హై క్రోమా సే' వినియోగదారులు తమ గృహాలను మరింత మెరుగ్గా ఊహించుకోవడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, ఈ ప్రచారంలో భాగంగా ఒక యువ జంట ప్రయాణాన్ని చూపించే మూడు హృద్యమైన డిజిటల్ చిత్రాలు కూడా ఉన్నాయి. రోజువారీ గృహోపకరణాల ఎంపికలు జీవితంలోని అత్యంత ముఖ్యమైన ఘట్టాలకు ఎలా నేపథ్యంగా నిలుస్తాయో ఈ చిత్రాలు అద్భుతంగా చిత్రీకరిస్తాయి. అదనంగా, ఎంపిక చేసిన కొన్ని క్రోమా స్టోర్‌లు, వాషింగ్ మెషీన్ల స్ఫూర్తితో రూపొందించిన భారీ ఇన్‌స్టాలేషన్‌లుగా రూపాంతరం చెందుతాయి. ఇవి అత్యంత ప్రభావవంతమైన రిటైల్ కేంద్రాలుగా మారి, ప్రచారానికి జీవం పోసి, ఎక్కువ మందిని ఆకర్షించి, బ్రాండ్ గుర్తింపును బలోపేతం చేస్తాయి.

డిజిటల్, OTT మరియు సోషల్ మీడియాలో గణనీయమైన ప్రాబల్యంతో పాటు, క్షేత్రస్థాయి యాక్టివేషన్లతో కూడిన ఈ సమీకృత ప్రచారం, దేశవ్యాప్తంగా వినియోగదారులతో మరింత లోతైన భావోద్వేగ బంధాన్ని ఏర్పరచడానికి రూపొందించబడిన వీడియో-ఆధారిత కథనంలో క్రోమా చేసిన అత్యంత ముఖ్యమైన పెట్టుబడిగా నిలుస్తుంది.

# కియా ఇండియా అహ్మదాబాద్‌లో కొత్త డీలర్ ట్రైనింగ్ అకాడమీని ప్రారంభించింది

## – దేశవ్యాప్తంగా రెండో శిక్షణా కేంద్రం

**– అహ్మదాబాద్‌లోని సూపర్‌నోవా కియా వద్ద కొత్త డీలర్ ట్రైనింగ్ అకాడమీ ప్రారంభం; డీలర్ సిబ్బంది నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించి, కస్టమర్ అనుభవాన్ని మరింత మెరుగుపరచడమే లక్ష్యం.**

**– ఈ అకాడమీలో ప్రతి నెల సుమారు 250 మంది సిబ్బందికి శిక్షణ అందించే సామర్థ్యం ఉంది.**

**– కొచ్చి తర్వాత భారతదేశంలో రెండో డీలర్ ట్రైనింగ్ అకాడమీ; రెండు కేంద్రాల కలిపిన శిక్షణా సామర్థ్యం నెలకు సుమారు 500 మంది.**




**విజయవాడ, ఆగస్టు 18 నేటి మనదేశమ్ :**దేశంలోని ప్రముఖ మాస్-ప్రీమియం కార్ల తయారీ సంస్థలలో ఒకటైన కియా ఇండియా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సూపర్‌నోవా కియా ప్రాంగణంలో తన కొత్త డీలర్ ట్రైనింగ్ అకాడమీని ప్రారంభించింది. నెలకు సుమారు 250 మంది సిబ్బందికి శిక్షణ అందించే సామర్థ్యంతో ఈ అకాడమీ, సేల్స్ మరియు సర్వీస్ విభాగాల్లో నైపుణ్యం కలిగిన, పరిజ్ఞానం ఉన్న డీలర్ బృందాలను అభివృద్ధి చేయాలన్న కియా ఇండియా లక్ష్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఈ అకాడమీ ద్వారా గ్రూప్ డీలర్‌షిప్‌లలోని సేల్స్ మరియు సర్వీస్ బృందాల కోసం డీలర్ ఆధ్వర్యంలో లెవల్-1 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. స్థానిక స్థాయిలో శిక్షణా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం ద్వారా, కొత్త సిబ్బందికి వేగవంతమైన శిక్షణ, ఇప్పటికే పనిచేస్తున్న సిబ్బందికి నిరంతర నైపుణ్యాభివృద్ధి, అలాగే కేంద్రీకృత శిక్షణపై ఆధారపడే అవసరం తగ్గుతుంది. దీంతో ఉద్యోగ బాధ్యతలకు అనుగుణమైన లోతైన నైపుణ్యం పెరగడంతో పాటు, డీలర్‌షిప్ స్థాయిలో ఉద్యోగుల స్థిరత్వం కూడా మెరుగుపడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారులకు స్పష్టమైన కమ్యూనికేషన్, వేగవంతమైన సేవల అందుబాటు, అన్ని ప్రాంతాల్లో ఒకే విధమైన సేవా ప్రమాణాలు, అలాగే మరింత సులభమైన మరియు మెరుగైన వాహన యాజమాన్య అనుభవం లభిస్తుంది. ప్రస్తుత మరియు భవిష్యత్ వ్యాపార అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ అకాడమీ, సాంకేతిక నైపుణ్యాలు, ప్రవర్తనా నైపుణ్యాలు మరియు అత్యుత్తమ సేవా నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. దీని ద్వారా కియా యొక్క విస్తరిస్తున్న వినియోగదారుల వర్గానికి ప్రతి సేవా కేంద్రంలోనూ విశ్వసనీయమైన, పారదర్శకమైన మరియు అత్యున్నత ప్రమాణాల సేవలు అందించబడతాయి. ఈ అహ్మదాబాద్ అకాడమీ, ఈ ఏడాది ప్రారంభంలో కొచ్చిలోని ఇంచియాన్ కియా వద్ద ప్రారంభించిన కియా ఇండియా తొలి డీలర్ ట్రైనింగ్ అకాడమీ విజయాన్ని కొనసాగిస్తూ, సంస్థ యొక్క డీలర్ నెట్‌వర్క్‌కు మరింత సమీపంలో నిర్మాణాత్మక శిక్షణ అందించాలనే లక్ష్యాన్ని బలపరుస్తుంది. ప్రస్తుతం కియా ఇండియాకు రెండు డీలర్ ట్రైనింగ్ అకాడమీలు ఉండగా, ఇవి కలిపి ప్రతి నెల సుమారు 500 మంది సిబ్బందికి శిక్షణ అందించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. దీని ద్వారా నైపుణ్యం కలిగిన డీలర్ బృందాలను తీర్చిదిద్దడం మరియు దేశవ్యాప్తంగా సేల్స్, సర్వీస్ నెట్‌వర్క్ అంతటా ఒకే విధమైన కస్టమర్ అనుభవాన్ని అందించడం పట్ల సంస్థ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.

# అనకాపల్లి జిల్లా పోలీసులకు 25 బాడీ వార్న్ కెమెరాలు అందజేసిన Eisai ఫార్మా



**అనకాపల్లి ఆగస్టు 18 నేటి మనదేశమ్ :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీసు శాఖకు పరవాడలోని Eisai ఫార్మాస్యూటికల్స్ సంస్థ 25 బాడీ వార్న్ కెమెరాలను సీఎస్ఆర్ (CSR) నిధుల ద్వారా విరాళంగా అందజేసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ.. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు, పోలీసు విధి నిర్వహణకు ఆధునిక సాంకేతికతకు ఈ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సహకారం అందించిన జుఱయిఱ ఫార్మా ప్రతినిధులు గిరీష్ దీక్షిత్ (సైట్ హెడ్), ఆనంద్ గాల్పాడే (అడ్మినిస్ట్రేషన్ హెడ్), మదన్ మోహన్ లకు ఎస్పీ అభినందనలు తెలిపారు.

# పోరాటాలతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం

**– చట్టాల సవరణకు త్వరలో జాతీయ సదస్సు**

**– కూటమి ప్రభుత్వ హయాంలోనే ఇళ్ల స్థలాలు..పెన్షన్ సదుపాయం సాధిస్తాం**

**– జిల్లా మహాసభకు భారీగా తరలివచ్చిన పాత్రికేయులు**

**– ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు**




**శ్రీకాకుళం, ఆగస్టు 18 నేటి మనదేశమ్ :**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు లు అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిలుగా పాల్గొన్న వీరు మాట్లాడుతూ. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న పాత్రికేయుల సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు సమాచారాన్ని స్వేచ్ఛగా సేకరించి ప్రజలకు అందించేందుకు అనుకూలంగా ఉన్న చట్టాలను మరింత పటిష్టంగా సవరించాలని వారు డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడంతో పాటు, వారికి మెరుగైన భద్రత, సామాజిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ తదితర సంక్షేమ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు జర్నలిస్టు సంఘాలు ఐక్యంగా పోరాడుతాయని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలపై చర్చించేందుకు త్వరలో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం ఫెడరేషన్ నిరంతరం తమ వంతు ప్రయత్నాలు చేస్తుందని స్పష్టం చేశారు.. పోరాటాల ద్వారానే జర్న లిస్టుల హక్కులు, సంక్షేమాన్ని సాధించగలమని వీరు పేర్కొన్నారు. ఈ సభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వేణుగోపాల్ అధ్యక్షత వహించగా ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మణరావు .. సీనియర్ పాత్రి కేయులు ఈశ్వరరావు ..సత్తార్ భాస్కర్ రావు . డాక్టర్ ప్రసాద్ రావు చంద్రశేఖర్, ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి నారాయణ, జి శ్రీనివాసరావు, ఏపీ బ్రాడ్ కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్.. కార్యవర్గ ప్రతినిధులు హరి ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నగేష్ బాబు, హరనాథ్ తో పాటు భారీగా జర్నలిస్టులు పాల్గొన్నారు

# జీవో నెం. 3పై ఇచ్చిన హామీని అమలు చేయాలి

## ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు

**శ్రీకాకుళం, ఆగస్టు 18 నేటి మనదేశమ్ :** గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉద్యోగాల్లో రక్షణ కల్పించే జీవో నంబర్ 3పై సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వైయస్ ఆర్‌సీపీ ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. ఏపీ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అరకు పర్యటన సందర్భంగా చంద్రబాబు నాయుడు జీవో నంబర్ 3ను కొనసాగిస్తామని, గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ ఉద్యోగాలను ఆదివాసీలకే కల్పిస్తామని స్పష్టంగా హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీని అమలు చేయడానికి ఎలాంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాల్లో ఏడాది కాలంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. "న్యాయ నిపుణులతో, గిరిజన సంఘాలతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదు. ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి, సమావేశం నిర్వహించి, ప్రత్యామ్నాయ మార్గంపై కనీసం ఒక తీర్మానం కూడా చేయలేకపోయారు" అని రవిబాబు ప్రశ్నించారు. జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయంగా గిరిజనులకు 100 శాతం ఉద్యోగ రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌లోని నిబంధనలను, అవసరమైతే ఆర్టికల్ 371-ఐను సవరించే అంశాన్ని పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలను స్థానిక ఆదివాసీ యువతకు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్న ఆయన, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇటీవలి డీఎస్సీ ప్రక్రియలో గిరిజన ప్రాంతాల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కేవలం ఆరు శాతం రిజర్వేషన్‌తో పరిమిత సంఖ్యలోనే ఉద్యోగాలు లభించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, గిరిజన ప్రాంతాల్లోని ఆదివాసీ యువతకు 100 శాతం ఉద్యోగ రక్షణ కల్పించేలా తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు, ప్రయోజనాల కోసం అవసరమైతే ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం వెంటనే కళ్లు తెరిచి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు హెచ్చరించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గొప్ప పోరాటయోధుడు : జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట ఆగస్టు 18 నేటి మనదేశమ్ ప్రతినిధి :**సిద్దిపేట జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్ పల్లి వెళ్ళే మార్గం వద్దగల చౌరస్తా లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూసబ్బండ వర్గాలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం ఈయన చేసిన కృషి చరిత్రలో నిలిచింది. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ఒక ప్రతీక. నాటి కాలంలో అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను కావాలని ప్రజాస్వామ్యక స్ఫూర్తితో చేసిన పోరాటం గొప్ప విషయం. విశ్వ కీర్తి పొందిన ఆయన గొప్పదనాన్ని స్మరించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారీ సయ్యద్ రఫీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, గౌడ సంఘ నాయకులు, మరియు తదితరులు పాల్గొన్నారు

# సమస్యలు పరిష్కరించాలని.. జీపీ కార్మికుల రెండు రోజుల దీక్ష



**శంకరపట్నం ఆగష్టు18 (నేటి మనదేశమ్):** గ్రామపంచాయతీ కార్మికులకు పర్మనెంట్ వేతనాల పెంపు,రెండో పీఆర్సీలో గుర్తింపు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు తో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల వ్యాప్తంగా ఉన్న జీపీ కార్మికులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ముందు రెండు రోజుల దీక్షను ప్రారంభించారు.సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగుల సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో సుమారు 53 వేల మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు,కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు.గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ,గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు,అనారోగ్యాలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ కార్మికులు సేవలు అందిస్తున్నారు.కార్మికులు పనిచేసిన పనికి తగిన భద్రత,పర్మనెంట్ ఉద్యోగం,కనీస వేతనాలు,పీఆర్సీ,ఈఎస్ఐ,ప్రమాద బీమా,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులందరినీ పర్మనెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ,అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడిచినా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం లేదని విమర్శించారు.తమ సమస్యలను పరిష్కరించేందుకు ఆగస్టు 18, 19 తేదీల్లో చేపడుతున్న దీక్షల తో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు అనుమతించాలని కోరారు.మండల జీపీ వర్కర్స్ అధ్యక్షుడు ఎలుకపల్లి సారయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని,కనీస వేతనం రూ.26 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.జీవో నంబర్ 51ను సవరించి,బహుళ ప్రయోజన కార్మికుల విధానాన్ని రద్దు చేయాలని కోరారు.బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జనార్ధన్, కోశాధికారి బండి రమేష్,రాములు, మేకల లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్, ఆగష్టు18 (నేటి మనదేశమ్ ప్రతినిధి)::** బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, వారి జీవిత చరిత్ర నేటి తరాలకు ఆదర్శనీయమని జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, గౌడ సంఘాల నాయకులు, బి.సి. సంఘాల నాయకులతో కలిసి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి అప్పటి మొగల్ పాలకుల అరాచకాలను ఎదిరించి గోలుగొండ పాలించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. పాలకులకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన ప్రజలకు అండగా నిలిచారని, ప్రతి ఒక్కరు పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల నాయకులు తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే దిశగా నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, గౌడ సంఘాల ప్రతినిధులు బాలేశ్వర్ గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్, కొం౦డ్ర మనోహర్ గౌడ్, మార్క శంకర్ గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు నీరజ గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18,(నేటి మనదేశమ్)**,కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని నిరుద్యోగ యువత తరపున మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్, ఎస్ఎస్‌సీ జీడీ, అగ్నివీర్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్ తదితర యూనిఫాం సర్వీసుల ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వందలాది మంది అభ్యర్థులకు ప్రగతి మైదానం ప్రధాన శిక్షణా వేదికగా ఉందని పేర్కొన్నారు. మైదానంలోని 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, 1,600 మీటర్ల ప్రాక్టీస్ ట్రాక్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ప్రాంతాలు పూర్తిగా దెబ్బతిని వినియోగానికి అనువుగా లేకుండా పోయాయని తెలిపారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.భారీ వాహనాలు మైదానంలోకి తరచూ ప్రవేశించడం వల్ల ట్రాక్ మరింత దెబ్బతింటోందని, మద్యం సీసాలు, పగిలిన గాజు ముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర చెత్తను మైదానంలో పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొదలు పెరిగిపోవడంతోపాటు చెత్త పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, పాములు, ఇతర విషపూరిత జీవుల సంచారం పెరిగి అభ్యర్థుల భద్రతకు ముప్పుగా మారిందని తెలిపారు.దెబ్బతిన్న ట్రాక్, ప్రమాదకర పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలువురు అభ్యర్థులు శిక్షణ సమయంలో గాయపడ్డారని, దీంతో వారి ఉద్యోగ సాధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉన్న ఏకైక చవకైన శిక్షణా మైదానం ప్రగతి మైదానమేనని, దీనిని ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం కేవలం మౌలిక వసతుల కల్పన మాత్రమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత భవిష్యత్తులో పెట్టుబడి అని వారు పేర్కొన్నారు.

**తమ డిమాండ్లు:** 400 మీటర్ల, 1,600 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లను పునరుద్ధరించి అభివృద్ధి చేయాలి.ప్రమాణాలకు అనుగుణంగా లాంగ్‌జంప్, షాట్‌పుట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.చెత్త, మద్యం సీసాలు, పగిలిన గాజు ముక్కలు, పొదలు తదితర ప్రమాదకర వ్యర్థాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రతను పాటించాలి.భారీ వాహనాలు మైదానంలోకి ప్రవేశించకుండా శాశ్వత అడ్డుకట్టలు లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.మైదానానికి నిరంతర నిర్వహణ, పారిశుద్ధ్యం, భద్రత కల్పించాలి.ఈ సమస్యను అత్యవసర ప్రజా సమస్యగా పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అధికారులు సత్వరమే స్పందిస్తే వందలాది మంది యువతకు ప్రయోజనం చేకూరడంతోపాటు శిక్షణ సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

# మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి.. అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

## శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్



**ఖమ్మం జిల్లా,ఆగస్టు-18, నేటి మన దేశమ్ ప్రతినిధి** మహనీయుల జీవితాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక సమానత్వం, బడుగు--బలహీన వర్గాల హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. జానయ్య, నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్, పోలంపల్లి నాగరాజు గౌడ్, బండి నాగేశ్వరరావు గౌడ్, గజ్జెల్లి వెంకన్న, నూతి సత్యనారాయణ గౌడ్, వూడుగు శ్రీనివాస్ గౌడ్, బొలిగాని శ్రీనివాస్ గౌడ్, బిచ్చాల తిరుమలరావుగౌడ్, మారగాని సుదర్శన్ గౌడ్, బెల్లంకొండ శరత్ గౌడ్, కప్పల మధు గౌడ్, కుక్కల నాగేశ్వరావు,మూడు ముంతల గంగరాజు గౌడ్, కొమిలి శ్రీనివాస్ గౌడ్, జి. శ్రీనివాసరావు, మార్కం లింగయ్య గౌడ్, దాసరి శ్రీరాములు గౌడ్, అల్లిక అంజయ్య, పగడాల నాగరాజు, గుడిద శ్రీనివాస్, వట్టికూటి ఉమాదేవి, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, రుద్ర ప్రదీప్, మొక్క శేఖర్ గౌడ్, బిసి కుల సంఘ నాయకులు, వెనుకబడిన తరగతుల కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్‌లో కనకరపు రాజశేఖర్ ఘనత..

## - ప్రతిష్టాత్మక బ్లాక్ బెల్ట్ 3 డిగ్రీ సొంతం



**వేములవాడ, ఆగస్ట్ 18 : నేటి మన దేశమ్ ప్రతినిధి** కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడకు చెందిన యువకుడు అద్భుత ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ 3 డిగ్రీ సాధించాడు. కరీంనగర్ పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో మంగళవారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు.వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో 15 సంవత్సరాల నుండి శిక్షణ పొందుతున్న వేములవాడకు చెందిన యువకుడు, సీనియర్ కరాటే ఇన్స్ట్రక్టర్ కనికరపు రాజశేఖర్ ఈ పరీక్షల్లో తన సత్తా చాటాడు. కరాటేలో అత్యంత కఠినమైన కటాస్, కుమిటే విన్యాసాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రతిష్టాత్మక 'బ్లాక్ బెల్ట్'3 డిగ్రీ కైవసం చేసుకున్నాడు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ చేతుల మీదుగా కనకరపు రాకేష్ బ్లాక్ బెల్ట్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.కరాటే గ్రేడింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రాజశేఖర్ ను ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షులు కొండ దేవయ్య, సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ మన్నాన్, పలువురు కరాటే ఇన్స్ట్రక్టర్లు, అభినందించారు. అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు రాజశేఖర్, మోయిజ్ తదితరులు ఉన్నారు.

# ఉచిత ఆరోగ్య సేవకు విశేష స్పందన



**శంకరపట్నం ఆగష్టు18 (నేటి మనదేశమ్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కాండ్ల లో ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్.ఎల్.హెచ్.పి అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ శిబిరంలో దాదాపు 50 మందికి బీపీ,షుగర్,డెంగ్యూ మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి,ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అనిల్,పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్,ఏఎన్ఎంలు స్వప్న,జ్యోతి,ఆశాలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కళకు గౌరవం.. కళాకారులకు ప్రోత్సాహం- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి








**మిర్యాలగూడ ఆగష్టు18 (నేటి మనదేశమ్):** కళాకారులను ప్రోత్సహిస్తూ, వారి కళా ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించేందుకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక బీసీ భవన్ లో శుక్రవారం జరిగిన పాట తో ఒక పూట కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులు తమ ప్రతిభతో సమాజానికి సందేశాన్ని అందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కళా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కళాకారులకు అవసరమైన ప్రోత్సాహం, వేదికలు, అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.స్థానిక కళాకారుల ప్రతిభను వెలికితీసి వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా సహకరిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. కళాకారుల సంక్షేమం, కళా పోషణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులకు విజేతలకు బహుమతి ప్రధానశీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గౌతమ్‌పూర్‌లో బీఎల్‌ఓలకు ఘన సన్మానం...

## ఓటర్ల సవరణ కార్యక్రమం విజయవంతంలో బీఎల్‌ఓల సేవలు అభినందనీయం...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18,(నేటి మనదేశమ్)**,చుంచుపల్లి మండలం గౌతమ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఓటు హక్కు నమోదు అధికారులు (బీఎల్‌ఓలు) పద్మ, ఈశ్వరి, శివలీల, మస్తాన్‌లను ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా బాధ్యతాయుతంగా పూర్తి చేసినందుకు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సపావత్ కళ్యాణి, ఉపసర్పంచ్ గంగారం, పంచాయతీ కార్యదర్శి షర్మిల బీఎల్‌ఓలకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులను బీఎల్‌ఓలు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కళ్యాణి, ఇతర ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో బీఎల్‌ఓల సేవలు కీలకమని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా బీఎల్‌ఓలు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ఓటర్ల సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎర్ర ప్రియాంక, శిల్ప, కేత రాధ, ఈశ్లావత్ కాంతమ్మ, సపావత్ సురేష్, గ్రామ పెద్ద సొప్పరి క్రాంతి, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న సర్పంచ్..

## - బిడ్డ పుట్టిన వేళ రూ.10,016 సాయం



**వేములవాడ, ఆగస్ట్ 18: నేటి మన దేశమ్ ప్రతినిధి** మంజీడి ప్రవంతి--వినోద్ దంపతులకు బిడ్డ జన్మించిన సందర్భంగా సర్పంచ్ ఇటిక్యాల రాజు రూ.10,016 ఆర్థిక సాయం అందజేశారు. గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ సాయం అందించినట్లు తెలిపారు. దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రశాంత్, మాజీ సర్పంచ్ మల్లేశం, వార్డు సభ్యుడు రాంబాబు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు లింగయ్య, తిరుపతి, రాజిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలు అభినందనీయం...

**మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18,(నేటి మనదేశమ్)**,మణుగూరు ప్రభుత్వ ఐటీఐ--అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు అభినందనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మణుగూరులో నిర్వహించిన విద్యార్థుల ఆవిష్కరణల అభినందన సభలో మంత్రి పాల్గొని విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించారు.పార్థసారథి, స్ఫూర్తి రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మరింత అభివృద్ధి చేసి కమర్షియల్ వెహికల్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 119 ఏటీసీల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.టాటా సంస్థ ద్వారా మణుగూరు ఏటీసీలో శిక్షణ పొందుతున్న సుమారు 100 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీ, జపాన్‌లో ఉద్యోగాల కోసం టామ్‌కామ్ ద్వారా విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం రూ.90 కోట్లు కేటాయించిందన్నారు.మారుమూల గిరిజన ప్రాంతాల్లో యువత, యువ రైతుల కోసం ఆధునిక వ్యవసాయ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మణుగూరులో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఏటీసీ ద్వారా ఆధునిక సాంకేతిక విద్య అందడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తే విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.మణుగూరు ఏటీసీలో 244 మంది, ఐటీఐలో 168 మంది కలిపి మొత్తం 412 మంది శిక్షణ పొందుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఏటీసీ శిక్షణ పూర్తి చేసిన 50 మంది విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు. ఏజెన్సీ విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీఎన్‌సీ వంటి ఆధునిక కోర్సులకు డిమాండ్ ఉందన్నారు. ఐటీఐ, ఏటీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ట, అధికారులు, ఏటీసీ ప్రిన్సిపాల్ సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# వంతెన నిర్మాణంతో ప్రజలకు ప్రయాణం సులభతరం..

**రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ఆసిఫాబాద్, ఆగస్టు18 (నేటి మనదేశమ్ ప్రతినిధి)::**ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం అంకుశపూర్ – తట్టుగూడెం మధ్య 8 కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన హై లెవెల్ వంతెన నిర్మాణానికి శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, కాగజ్ నగర్ రాజస్వ మండలాధికారి చెన్నూరి కిష్టయ్య, రోడ్డు భవనాల శాఖ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లినప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హై లెవెల్ వంతెనల నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే కాగజ్‌నగర్, వాంకిడి ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి సమీప పట్టణాలు, మార్కెట్లు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, ఇతర అవసరాలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. హై లెవెల్ వంతెన నిర్మాణంతో వరదల సమయంలో ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. వంతెన పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత అంచనాలు, సాంకేతిక ప్రమాణాల మేరకు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు – 18: నేటి మన దేశమ్ ప్రతినిధి** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా,ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యాంటీ ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి..

**ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా...**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ఆగస్టు 18,(నేటి మనదేశమ్)**,విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని, ర్యాగింగ్‌కు పాల్పడి తోటి విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించవద్దని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హవీలా సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులు శిక్షార్హులని ఆమె స్పష్టం చేశారు.మంగళవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి విభాగంలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ హవీలా మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, సెల్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా విద్యార్థి ర్యాగింగ్‌కు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని, యాంటీ ర్యాగింగ్ సెల్ ద్వారా కౌన్సెలింగ్ అందిస్తామని చెప్పారు.సీనియర్ విద్యార్థులు కళాశాలకు వచ్చే జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రేమానురాగాలతో కలిసి చదువుకోవాలని సూచించారు.ఎస్సై స్వప్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఇతరులను ర్యాగింగ్ చేయవద్దని సూచించారు. అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని సమస్యలను పోలీస్ స్టేషన్ వరకు తీసుకురావద్దని హితవు పలికారు. విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా కళాశాలలోని ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్‌ను సంప్రదించి సూచనలు, సహాయం పొందాలని తెలిపారు.కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, డాక్టర్ రాగ సుమ, డాక్టర్ నాగ సమీరా, సుధాకర్, రమేష్, పూర్ణిమతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు..

**రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ఆసిఫాబాద్, ఆగస్టు18 (నేటి మనదేశమ్ ప్రతినిధి)::**అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్లు ఆకాష్, సహిన్ సుల్తానా, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్ నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించడం జరిగిందని, అర్హులైన నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇద్దామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ కొరకు అధిక ప్రాథమిక ఇస్తుందని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పర్యాటకరంగ అభివృద్ధికి నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వట్టివాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతను పాటించడం జరుగుతుందని, ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరు అయితే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, గృహ నిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని బీఆర్ఎస్ నిరసన..




**ఆసిఫాబాద్, ఆగస్టు18 (నేటి మనదేశమ్ ప్రతినిధి)::**కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న పథకాలను ఎలాంటి కోతలు, ఆంక్షలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేద ఆడబిడ్డలకు అందుతున్న ఆర్థిక భరోసాను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని తెలిపారు.పథకం ద్వారా వేలాది నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని వెంటనే అమలు చేయాలని, కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలకు నిధులు సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరపున మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి భీమా నగదు అందజేత



**శంకరపట్నం ఆగష్టు18 (నేటి మనదేశమ్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ శ్రీ వెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు బత్తిని సాయిబాబా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.అతడి భార్య శ్రీవాణి కి బీమా నగదును పొదుపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అందించారు.బీమా నగదు రూ.86250 లను సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో అందించారు.రాజిరెడ్డి మాట్లాడుతూ పురుషుల పొదుపు సంఘాల బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో చనిపోయిన సభ్యుల కుటుంబాలకు ప్రమాద బీమా చెక్కులు,పొదుపు బోనస్ కలిపి అందజేశారు.వీరి వెంట ఉపాధ్యక్షుడు బొమ్మ దేవి చంద్రమౌళి,పాలకవర్గ సభ్యులు ఉప్పరి సంపత్,కొత్త ఆనంద్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్,చామంతుల కుమారస్వామి,పూదరి మొగిలయ్య, ఆరేపల్లి ఓదెలు,పాంద్రాల శ్రీనివాస్, పోలు రమేష్,ఎం.డి. రఫీ,ఘనకులు కొరిమి సారయ్య ఉన్నారు.

# భర్త మృతి.. ఆస్తి కోసం అన్నా వదిన వేధింపులు?

**ఆస్తి పత్రాలు, 15 తులాల బంగారం తీసుకున్నారని వితంతువు ఆరోపణ**

**"నా బిడ్డ భవిష్యత్తు కోసం కనికరించండి.. న్యాయం చేయండి" అంటూ కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితురాలు**

**ధర్మపురిలో వెలుగుచూసిన ఘటన.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ప్రభుత్వ ఉపాధ్యాయులే**



**జగిత్యాల ప్రతినిధి, ఆగస్టు 18 (నేటి మన దేశమ్ ప్రతినిధి):**భర్తను కోల్పోయిన విషాదంలో ఉన్న ఓ వితంతువుకు అండగా నిలవాల్సిన బంధువులే ఆస్తి విషయంలో వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో కలకలం రేపుతున్నాయి. భర్త మృతిచెందిన తర్వాత తనకు, తన పదేళ్ల కుమార్తెకు చెందాల్సిన ఆస్తి పత్రాలతో పాటు సుమారు 15 తులాల బంగారాన్ని భర్త అన్న, వదిన తమ వద్ద ఉంచుకున్నారని ధర్మపురికి చెందిన మానస ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ కుమార్తె చిన్మయితో కలిసి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి వినతిపత్రం అందజేశారు.

**గుండెపోటుతో భర్త మృతి** మానస తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన దహగాం గిరీష్ 2025 ఏప్రిల్ 18న అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందారు. దీంతో భార్య మానస, పదేళ్ల కుమార్తె చిన్మయి తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భర్తను కోల్పోయిన బాధ నుంచి తేరుకోకముందే ఆస్తి విషయంలో కుటుంబ సభ్యుల నుంచి సమస్యలు ఎదురయ్యాయని మానస వాపోయారు.

**ఆస్తి పత్రాలు, బంగారం తమ వద్దే** తన భర్త పేరున ఉన్న పొలం, ఇంటికి సంబంధించిన పత్రాలతో పాటు సుమారు 15 తులాల బంగారాన్ని భర్త అన్న దహగాం గణేష్, వదిన కాసర్ల లావణ్య తమ వద్ద ఉంచుకున్నారని మానస ఆరోపించారు. వాటిని తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా స్పందించలేదని, తన కుమార్తె చదువు, భవిష్యత్తు కోసం కనికరించాలని వేడుకున్నా ఫలితం లేకపోయిందని కన్నీటిపర్యంతమయ్యారు."నా భర్తను కోల్పోయి నేను, నా బిడ్డ ఒంటరిగా మిగిలాం. కనీసం మా బిడ్డ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మా ఆస్తి పత్రాలు, బంగారం తిరిగి ఇవ్వాలని వేడుకున్నాను. అయినా ఎవరూ కనికరించలేదు. అందుకే అధికారులను ఆశ్రయించాల్సి వచ్చింది" అని మానస ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు ప్రభుత్వ ఉపాధ్యాయులే** ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దహగాం గణేష్ ధర్మపురిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారని, కాసర్ల లావణ్య జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారని మానస పేర్కొన్నారు.పిల్లలకు విద్యాబుద్ధులు, విలువలు నేర్పాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ తెలియాల్సి ఉంది.

**న్యాయం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన వితంతువు** కుటుంబ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో మానస తన కుమార్తె చిన్మయితో కలిసి జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. భర్త పేరున ఉన్న ఆస్తికి సంబంధించిన పత్రాలు, బంగారం తిరిగి ఇప్పించడంతో పాటు తన కుమార్తె భవిష్యత్తును కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

**వారసత్వ హక్కులపై చర్చ** భర్త మృతిచెందిన సందర్భంలో ఆయన ఆస్తికి చట్టబద్ధ వారసుల హక్కులు, ఆస్తి స్వరూపం, వసియత్ లేదా ఇతర చట్టపరమైన పత్రాలు ఉన్నాయా అనే అంశాల ఆధారంగా వారసత్వ హక్కులు నిర్ణయించబడతాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అలాగే మహిళకు చెందిన వ్యక్తిగత బంగారం విషయంలోనూ సంబంధిత చట్టపరమైన ఆధారాలను పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.బాధితురాలు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో పాటు అవసరమైతే జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో సంబంధిత విద్యాశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొంటున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు** భర్తను కోల్పోయిన తర్వాత తన కుమార్తెతో కలిసి జీవనం సాగిస్తున్న తనకు ఆస్తి విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, తన బిడ్డ భవిష్యత్తును కాపాడాలని మానస కోరుతున్నారు. తన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం న్యాయం చేయాలని జిల్లా అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి వివరణ ఏమిటి? అన్నది తెలియాల్సి ఉంది. పూర్తి వాస్తవాలు అధికారిక విచారణ అనంతరం వెలుగులోకి రావాల్సి ఉంది.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com